**ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి**

“ప్రజాప్రశ్న” దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం



PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267

తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 80, పేజీలు - 08

శుక్రవారం, సెప్టెంబర్ 18, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD









## ఎర్రవల్లి కోటపై సర్కార్ పంజా

### - కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు రెవెన్యూ నోటీసులు.?

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాజకీయాల్లో ఏళ్ల తరబడి ఒక మిస్టరీగా, అధికార కేంద్రానికి ప్రతిరూపంగా నిలిచిన సిద్దిపేట జిల్లా ఎర్రవల్లి ఫామ్‌హౌస్ కాంపౌండ్ ఇప్పుడు చట్టపరమైన, పరిపాలనాపరమైన చక్రబంధంలో చిక్కుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన 30 రోజుల డెడ్‌లైన్ ప్రకటన ఊరికే కాదని నిరూపిస్తూ, రెవెన్యూ యంత్రాంగం వేగంగా ఆచరణలోకి దిగింది. మార్క్యాక్ తహశీల్దార్ కార్యాలయంలో గజ్వేల్ ఆర్డీవో చంద్రకళ నేతృత్వంలో సర్వేయర్లు, రెవెన్యూ ఉన్నతాధికారులు అత్యవసర సమీక్ష నిర్వహించి, ఫామ్‌హౌస్ పరిధిలోని పాత పహాణీలు, భూముల క్రయవిక్రయాల రికార్డులను క్షుణ్ణంగా తవ్వితీస్తున్నారు.

#### ఫామ్ హౌస్ భూముల లెక్కలు తీస్తున్న అధికారులు

ఈ గ్రౌండ్-లెవల్ ఆపరేషన్ అంతిమ లక్ష్యం.. ఫామ్‌హౌస్ కాంపౌండ్ వాల్ లోపల ఉన్నది కేవలం కేసీఆర్ చెబుతున్న పట్టా భూములు మాత్రమేనా లేక దళితులకు కేటాయించిన సీలింగ్, అసైన్డ్, ప్రభుత్వ కాలువల స్థలాలు ఏమైనా ఆక్రమణకు గురయ్యాయా అనే నిర్దిష్టమైన ప్రశ్నలకు చట్టబద్ధమైన సమాధానాలు రాబట్టడమే. క్షేత్రస్థాయి డిజిటల్ ల్యాండ్ సర్వే చేపట్టడానికి ముందు చట్టపరమైన చిక్కులు రాకుండా ఉండేందుకు, భూ సర్వే నిబంధనల ప్రకారం భూ యజమానులకు ముందస్తు నోటీసులు జారీ చేయడానికి అధికారులు లీగల్ కసరత్తు పూర్తి చేస్తున్నారు. అతి త్వరలోనే కేసీఆర్‌తో పాటు సంబంధిత ప్రతినిధులకు ఈ అధికారిక నోటీసులు అందనున్నట్లు సమాచారం.

#### సిద్ధిపేట కలెక్టర్‌కు కీలక బాధ్యతలు

ఈ పరిణామం రేవంత్ రెడ్డి సర్కార్ చేపడుతున్న ఆపరేషన్‌ను కేవలం రాజకీయ విమర్శల స్థాయి నుంచి రెవెన్యూ రికవరీ స్థాయికి తీసుకెళ్లింది. శాసనసభలో కాంగ్రెస్ ప్రభుత్వం లెక్కలు చూపించడమే కాకుండా, నెల రోజుల గడువు పెట్టి సిద్ధిపేట జిల్లా కలెక్టర్‌ను బాధ్యుడిని చేయడంతో అధికారులు ఏమాత్రం ఉపేక్షించకుండా ఫైల్స్‌ను సిద్ధం చేస్తున్నారు. సర్వే నిర్వహణ సమయానికి భూ యజమానులు లేదా వారి ప్రతినిధుల సమక్షంలోనే కొలతలు వేయాలని భావిస్తుండటంతో, ఎర్రవల్లి పరిసరాల్లో మునుపెన్నడూ ఉత్కంఠ వాతావరణం నెలకొంది.

#### రాజకీయమే అంటున్న బీఆర్ఎస్

ప్రతిపక్ష హోదాలో ఉన్న కేసీఆర్‌ను రాజకీయంగా నిరోధించలేక, కాంగ్రెస్ ప్రభుత్వం పాత కక్షలతోనే నోటీసులు, విచారణల పేరుతో హడావుడి చేస్తోందని మండిపడుతున్నాయి. గత పదేళ్లలో లేని భూ సమస్యలు ఇప్పుడు కొత్తగా ఎలా ఊడిపడ్డాయని, ఇది తమ అధినేత మనోధైర్యాన్ని దెబ్బతీసేందుకు అధికార పక్షం

2లో..

## కేంద్రంలో మళ్లీ థర్డ్ ఫ్రంట్.?

### - ఇండీ కూటమిని కెలుకుతున్న డీఎంకే!



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** తమిళనాడులో దశాబ్దాలుగా తమకు నమ్మకమైన మిత్రపక్షంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ, విజయ్ టీవీకే స్థాపించి అధికారంలోకి రాగానే, తమకు ఝలక్ ఇచ్చి ఆయన కూటమిలో చేరిపోవడంతో డీఎంకే రగిలిపోతోంది. కాంగ్రెస్ నిర్ణయాన్ని ఇప్పటికీ జీర్ణించుకోలేకపోతున్న డీఎంకే, ఇప్పుడు కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్ష ఇండియా కూటమిలో ఉండలేక, బయటికి వెళ్లలేక సతమతం అవుతోంది. ఈ నేపథ్యంలో కేంద్రంలో బీజేపీకి వ్యతిరేకంగా థర్డ్ ఫ్రంట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా డీఎంకే అధినేత స్టాలిన్ సోదరి, ఎంపీ కనిమొళి రంగంలోకి దిగారు.

#### డీఎంకే థర్డ్ ఫ్రంట్ ప్రయత్నాలు

ఇప్పటికే కనిమొళి ముంబై వెళ్లి ఉద్ధవ్ శివసేన నేత ఉద్ధవ్ థాక్రేను, ఢిల్లీలో ఎన్సీపీ అధినేత శరద్ పవార్, ఆయన కుమార్తె సుప్రియా సూలేను కలిశారు.

2లో..

## తెలంగాణలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు

### - ఓటర్ల జాబితా షెడ్యూల్ విడుదల



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికల ప్రక్రియకు ముందడుగు పడింది. 2027 మార్చిలో మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ వరంగల్-ఖమ్మం-నల్గొండ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ నియోజకవర్గాల్లో ఖాళీలు ఏర్పడనున్న నేపథ్యంలో కొత్తగా ఓటర్ల జాబితా సిద్ధం చేసేందుకు ఎన్నికల అధికారులు షెడ్యూల్ విడుదల చేశారు. ఈ ప్రక్రియలో అర్హత కలిగిన పట్టభద్రులు ఫారం-18 ద్వారా తమ పేర్లను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఓటర్ల జాబితా తయారీకి సంబంధించిన ప్రజా నోటీసును ఈనెల 28వ తేదీన జారీ చేయనున్నారు. ఆ తర్వాత అక్టోబర్ 15వ తేదీన పత్రికల్లో తొలి పునఃప్రచురణ, అక్టోబర్ 25వ తేదీన రెండో పునఃప్రచురణ చేపట్టనున్నారు. పట్టభద్రుల నుంచి ఫారం-18 దరఖాస్తుల స్వీకరణకు నవంబర్ 6ని చివరి తేదీగా నిర్ణయించారు.

2లో..

## రాష్ట్రంలో తీవ్ర కరవుపై ముందస్తు చర్యలు శూన్యం

### - కూటమి ప్రభుత్వంపై జగన్ ధ్వజం



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్‌లో తీవ్రమవుతున్న కరవు, వర్షాభావ పరిస్థితులపై వైసీపీ అధినేత జగన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి రీజనల్ కో-ఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన జిల్లాల వారీగా పరిస్థితులపై సమీక్ష జరిపారు. ఖరీఫ్ ప్రారంభం నుంచి సెప్టెంబర్ 16 వరకు

2లో..

## జాతి ప్రయోజనాల కోసం ప్రధాని మోడీకి అండగా నిలవాలి

### - ఎన్డీఏ భాగస్వామ్యాన్ని ఏపీ బలపరుస్తోంది





**వారణాసి (ప్రశ్న న్యూస్)** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుట్టినరోజు సందర్భంగా వారణాసిలో నిర్వహించిన ‘కాశీ-వాద్‌నగర్ సేవా సంకల్ప్ అభియాన్’ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రసంగం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రుద్రాక్ష్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ సభలో ఆయన తన వాగ్ధాటితో సభికులను ఉత్తేజపరిచారు. ప్రధాని మోదీ పాలన, దార్శనికత, దేశానికి అందిస్తున్న సేవలను వివరిస్తూనే, ఆంధ్రప్రదేశ్‌తో కేంద్ర ప్రభుత్వ బంధాన్ని బలంగా చాటిచెప్పారు. చంద్రబాబు ప్రసంగం ప్రారంభించకముందే

2లో..

## హైదరాబాద్‌లో ‘హార్వర్డ్’ కోర్సులు

### - సీఎం రేవంత్ రెడ్డి కీలక ప్రకటన



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ప్రపంచ ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీ హైదరాబాద్‌లో ఔత్సాహికులకు ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కోర్సులను డిసెంబర్ నుంచి అందించనుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. తెలంగాణను ‘గ్లోబల్ నాలెడ్జ్ హబ్’గా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని చెప్పారు. యూకే బిజినెస్ స్కూళ్ల ప్రతినిధుల బృందంతో బుధవారం ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలో జరిగిన సమావేశంలో సీఎం ఈ వివరాలు వెల్లడించారు. ఈ భేటీలో యూకే హౌస్ ఆఫ్ లార్డ్స్ సభ్యుడు కరణ్ బిలిమోరియా, బ్రిటిష్ కౌన్సిల్ డైరెక్టర్ జనక పుష్పనాథన్, చార్టర్డ్ అసోసియేషన్ ఆఫ్ బిజినెస్ స్కూల్స్ సీఈవో ఫ్లోరా హామిల్టన్, బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ ప్రతినిధులతోపాటు వివిధ యూకే యూనివర్సిటీలకు చెందిన సుమారు 30 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. వివిధ బిజినెస్ స్కూళ్ల డీన్లు, ఉన్నతస్థాయి అధికారులతో సీఎం చర్చించారు. విశ్వవిద్యాలయాలకు అవసరమైన అన్ని రకాల సహకారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి తెలిపారు. ఎంఐటీ, పర్డ్యూ వంటి పలు ప్రముఖ విశ్వవిద్యాలయాలు హైదరాబాద్‌లో ఆఫ్‌షోర్ క్యాంపస్‌లు

2లో..

## కేసీఆర్ పుట్టుకతోనే కుబేరుడు

### - సున్నాలేసుకున్నది నువ్వే

### - భూములపై రేవంత్‌కు కేటీఆర్ ఘాటు కౌంటర్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** శాసనసభ వేదికగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబ భూములపై ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలు, విచారణ ఆదేశాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. జాతీయ సమైక్యత దినోత్సవం సందర్భంగా తెలంగాణ భవన్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో అబద్ధాలు చెప్తున్నారని, నిన్నటివరకు కేసీఆర్ ఫామ్‌హౌస్ వెయ్యి ఎకరాల్లో ఉందన్న నోటితోనే ఇప్పుడు కేసీఆర్ దంపతుల పేరిట 67 ఎకరాలు ఉందంటూ తన మాటలను తానే మార్చుకున్నారని ఎద్దేవా చేశారు.

2లో..

## హైదరాబాద్‌లో సెప్టెంబరు 25న గణేశ్ నిమజ్జనం

### - నగరంలో పోలీసులు, ఆర్‌పిఎఫ్ ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్‌లో గణేశ్ ఉత్సవాలు, సెప్టెంబర్ 25న జరగనున్న విగ్రహాల నిమజ్జనం నేపథ్యంలో నగర పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. ఇందులో భాగంగా, రాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బందితో కలిసి గురువారం నగరంలోని పలు సున్నితమైన ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. శాంతిభద్రతలను కాపాడటం, మత సామరస్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఈ కవాతు చేపట్టారు. గోల్కొండ జోన్ డీసీపీ జె. రాఘవేందర్ రెడ్డి నేతృత్వంలో ఈ ఫ్లాగ్ మార్చ్ జరిగింది. గోషామహల్, బేగంబజార్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని జనసాంద్రత అధికంగా ఉండే ప్రాంతాల్లో ఈ కవాతు నిర్వహించారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ నుంచి మొదలైన ఈ ఫ్లాగ్ మార్చ్.. పటేల్ నగర్, దారుస్సలాం, ఘోడే కీ ఖబర్, జుమ్మేరాత్ బజార్ టీ-జంక్షన్ మీదుగా సాగింది. స్థానిక పోలీసులతో పాటు ఆర్‌ఏఎఫ్ సిబ్బంది ఇందులో పాల్గొన్నారు.

పండుగ సమయంలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా చూసేందుకు పోలీసు శాఖ సిద్ధంగా ఉందని ఈ ఫ్లాగ్ మార్చ్ ద్వారా ప్రజలకు భరోసా కల్పించారు.

2లో..

## సున్నా నుంచి వేల కోట్ల ఆస్తులకు ఎదిగిన భూ బకాసురుడు కేసీఆర్

### - కేసీఆర్ అఫిడవిట్ బయటపెట్టిన మంత్రి పొంగులేటి



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాజకీయాల్లో మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆస్తులపై మరోసారి తీవ్ర రాజకీయ విమర్శలు తెరపైకి వచ్చాయి. అసెంబ్లీ వేదికగా కేసీఆర్ ఫాంహౌస్, ఆయన కుటుంబానికి ఉన్న భూములకు సంబంధించిన వివరాలను వెల్లడించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ భూములు ఉంటే నిగ్గు తేల్చాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలోనే అటు బీఆర్ఎస్ ఇటు కాంగ్రెస్ పార్టీల మధ్య ప్రభుత్వ భూముల విషయంలో తీవ్ర మాటల యుద్ధం నెలకొంది. సీఎం రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలను ఖండిస్తూ బీఆర్ఎస్ నేతలు హరీశ్ రావు, కేటీఆర్, జగదీష్ రెడ్డిలు తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ క్రమంలోనే తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తాజాగా చేసిన ట్వీట్ తెగ వైరల్ అవుతోంది. ఆ ట్వీట్ లో కేసీఆర్ గతంలో ఎన్నికల అఫిడవిట్‌లో ప్రస్తావించిన భూములు, ఆస్తుల వివరాలను బయటపెట్టారు.కేసీఆర్ ఎన్నికల అఫిడవిట్‌లలో పేర్కొన్న

2లో..

## మీ మనస్తత్వం మార్చుకోండి.. హిందీని వద్దంటే కుదరదు

### - విజయ్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** జవహర్ నవోదయ విద్యాలయాల ఏర్పాటుకు సంబంధించి తమిళనాడు ప్రభుత్వానికి సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. “తమిళనాడు గడ్డపై హిందీ బోధించబోమని చెప్పడం కుదరదు” అని ధర్మాసనం స్పష్టం చేసింది. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో నవోదయ పాఠశాలల స్థాపనకు అవసరమైన స్థలాలను గుర్తించాలంటూ గతంలో ఇచ్చిన ఆదేశాలను తప్పనిసరిగా

2లో..

# ఎర్రవల్లి కోటపై సర్కార్ పంజా

ఆడుతున్న కక్షసాధింపు నాటకమని విమర్శిస్తున్నాయి. చట్టబద్ధంగా కొనుగోలు చేసిన భూములపై బురదజల్లడం కాంగ్రెస్ డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగమేనని గులాబీ నేతలు స్పష్టం చేస్తున్నారు. 30 రోజుల కాలమితిలో రెవెన్యూ యంత్రాంగం ఇచ్చే డిజిటల్ సర్వే నివేదిక ఆధారంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి తదుపరి చర్యలకు దిగుతుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఒకవేళ ప్రభుత్వ, అసైన్డ్ భూములు ఆక్రమణలో ఉన్నట్లు సర్వేలో తేలితే, వాటిని స్వాధీనం చేసుకుని దళితులకు పంపిణీ చేస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి సవాల్ నెరవేరుతుందా లేదా ఈ వివాదం సుదీర్ఘ న్యాయపోరాటానికి దారితీస్తుందా అనేది రాబోయే కొద్ది రోజుల్లో తేలనుంది.

# కేంద్రంలో మళ్లీ థర్డ్ ఫ్రంట్.?

అనంతరం బెంగాల్ వెళ్లి మాజీ సీఎం, తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీని కలిసేందుకు కనిమొళి ప్లాన్ చేసుకుంటున్నారు. ఇలా ఇప్పటికీ ఇండీ కూటమిలో ఉన్న పలు ప్రాంతీయ పార్టీలను కలుపుకుని థర్డ్ ఫ్రంట్ ఏర్పాటు చేసేందుకు డీఎంకే ప్లాన్ చేస్తోంది. ప్రస్తుతం డీఎంకేకు తమిళనాడులో అసెంబ్లీ కంటే జాతీయ స్థాయిలో ఎక్కువగా బలం ఉంది. లోక్ సభలో 22 మంది, రాజ్యసభలో 11 మంది కలుపుకుని డీఎంకేకు మొత్తం పార్లమెంట్ లో 33 మంది ఎంపీలున్నారు. వీరిలో కనీసం 22 మంది ఎంపీలు 2029 వరకూ లోక్ సభలో ఉంటారు.

### ఇండీ కూటమిపై ఫోకస్

ఈ బలాన్ని చూపి, ఇండీ కూటమిలోని ప్రాంతీయ పార్టీల్ని ఆకర్షించేందుకు కనిమొళి ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే ఇండియా కూటమి సమావేశాలకు డీఎంకే హాజరు కావడం లేదు. డీఎంకే వైఖరి వల్ల అటు విజయ్ టీవీకే సైతం ఇండీ కూటమిలోకి రాలేకపోతోంది. గత పార్లమెంటు వర్షాకాల సమావేశాలకు ముందు, తన పార్టీ ఎంపీలకు ప్రత్యేక సీటింగ్ ఏర్పాట్లు చేయాలని కనిమొళి రాసిన లేఖపై స్పీకర్ ఓం బిర్లా సానుకూలంగా స్పందించి ప్రత్యేక సీటింగ్ ఇచ్చారు. ఆగస్టులో స్పీకర్ ఏర్పాటు చేసిన సాంప్రదాయ టీ పార్టీని ఇండీ కూటమి బహిష్కరించినా, కనిమొళి మాత్రం హాజరయ్యారు.

### థర్డ్ ఫ్రంట్ ప్రయోగాలన్నీ విఫలం

అయితే కాంగ్రెస్ లేకుండా థర్డ్ ఫ్రంట్ ఆలోచనలు గతంలో చాలా రాజకీయ పార్టీలు చేసి విఫలమయ్యాయి. 2013లో కాంగ్రెసేతర, బీజేపీయేతర పార్టీలతో సమాఖ్య కూటమిని ఏర్పాటు చేయాలని మమతా బెనర్జీ స్వయంగా ప్రతిపాదించారు. ఐదేళ్ల తర్వాత 2019 ఎన్నికలకు ముందు అప్పటి తెలంగాణ సీఎం కేసీఆర్, మమతా బెనర్జీ, నవీన్ పట్నాయక్‌లతో భేటీలు నిర్వహించారు. అయినా ఎన్నికలకు ముందు అవి కాస్తా నీరుగారిపోయాయి. 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ కూడా ప్రతిపక్ష రాష్ట్రాలకు చెందిన ఏడుగురు ముఖ్యమంత్రులకు విందుకు ఆహ్వానం పంపినా ఫలించలేదు. ఈసారి డీఎంకే చేస్తున్న ప్రయత్నాలకు ఏ మేరకు ఇతర విపక్ష పార్టీలు స్పందిస్తాయన్నది త్వరలో తేలిపోనుంది.

## జాతి ప్రయోజనాల కోసం

# ప్రధాని మోడీకి అండగా నిలవాలి

రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆయనను ప్రత్యేకంగా అభినందించడం, ప్రసంగం ముగిశాక "వెరీ వెల్.. వెరీ వెల్" అంటూ ప్రశంసించడం సభలో అందరి దృష్టినీ ఆకర్షించింది. చంద్రబాబు తన ప్రసంగాన్ని హర హర మహాదేవ్ అంటూ ఆధ్యాత్మిక కోణంలో ఆరంభించడం విశేషం.

### వీకెఎస్ మంత్రం.. సరికొత్త నినాదం

ప్రధాని మోదీ ప్రస్థానాన్ని వివరిస్తూ చంద్రబాబు 'వీకెఎస్' అనే సరికొత్త మంత్రాన్ని ఆవిష్కరించారు. "వీ అంటే మోదీ జన్మస్థలమైన వాద్‌నగర్, కె అంటే ఆయన కర్మభూమి అయిన కాశీ, ఎస్ అంటే ఆయన జన్మించిన సెప్టెంబర్ 17. ఈ 'వీకెఎస్' మంత్రం ప్రజాస్వామ్యంలో అత్యంత శక్తివంతమైనది. సానుకూల దృక్పథంతో కృషి చేస్తే ఎవరైనా అత్యున్నత శిఖరాలను అధిరోహించవచ్చని మోదీ నిరూపించారు" అని చంద్రబాబు అన్నారు. సామాన్య కుటుంబంలో పుట్టి, రైల్వే స్టేషన్‌లో టీ అమ్ముతూ, కష్టపడి చదువుకుని దేశ ప్రధాని స్థాయికి ఎదగడం యువతకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు.

### అభివృద్ధి, సంక్షేమంలో మోదీ మార్క్

మోదీ నాయకత్వంలో గత పదేళ్లలో దేశంలో జరిగిన అభివృద్ధిని చంద్రబాబు అంకెలతో సహా వివరించారు. "మోదీ పాలనలో 25 కోట్ల మంది బహుముఖ పేదరికం నుంచి బయటపడ్డారు. 80 కోట్ల మందికి ఉచిత ఆహార ధాన్యాలు, 12 కోట్ల కుటుంబాలకు మరుగుదొడ్లు, 4 కోట్ల మందికి గృహ వసతి కల్పించారు. ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా తాగునీరు అందించాలన్నది ఆయన కల. పీఎం కిసాన్ కింద 11 కోట్ల మంది రైతులకు మధ్యవర్తులు లేకుండా నేరుగా వారి ఖాతాల్లోకి నగదు బదిలీ చేశారు" అని తెలిపారు. కరోనా మహమ్మారి సమయంలో 140 కోట్ల మంది ప్రజల ప్రాణాలను కాపాడటమే కాకుండా, 100 దేశాలకు ఉచితంగా వ్యాక్సిన్లు అందించి మానవత్వాన్ని చాటుకున్నారని ప్రశంసించారు.

### ఆత్మనిర్భర భారత్ నుంచి సాంకేతికత వరకు

రక్షణ రంగంలో భారత్ సాధించిన ప్రగతిని చంద్రబాబు ప్రత్యేకంగా ప్రస్తావించారు. "ఒకప్పుడు రక్షణ పరికరాలను దిగుమతి చేసుకునేవాళ్లం. కానీ నేడు మనమే సొంతంగా తయారు చేసుకుంటున్నాం. స్పేస్ టెక్నాలజీ, డ్రోన్ టెక్నాలజీ, సెమీకండక్టర్, క్వాంటమ్ టెక్నాలజీ వరకు అన్నింటిపైనా అవగాహన ఉన్న ఏకైక నేత మోదీ" అని కొనియాడారు. స్టార్టప్‌ల ద్వారా యువత ఉద్యోగాలు సృష్టించే స్థాయికి ఎదిగిందని, మహిళా సాధికారతకు -బేటీ బచావో- నుంచి -లఖ్‌పతి దీదీ- వరకు అనేక కార్యక్రమాలు చేపట్టారని గుర్తుచేశారు.

### కాశీలో బాలాజీ ఆలయానికి స్థలం ఇవ్వండి

తన ప్రసంగంలో భాగంగా ఆయన అయోధ్య రామజన్మభూమి అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. దశాబ్దాలుగా నలుగుతున్న అయోధ్య వివాదాన్ని ప్రధాని నరేంద్ర మోదీ పరిష్కరించి, రామ మందిర కలను సాకారం చేశారని చంద్రబాబు కొనియాడారు. ఈ సందర్భంగా సభికులను ఉద్దేశించి "నేను చెప్పింది నిజమే కదా?" అని ప్రశ్నిస్తూ, అందరితో "జై శ్రీరామ్" అని గట్టిగా నినాదాలు చేయించారు. దీంతో వారణాసిలోని రుద్రాక్ష్ కన్వెన్షన్ సెంటర్ ఒక్కసారిగా ఆ నినాదాలతో మార్మోగింది. ఈ సందర్భంగా చంద్రబాబు ఒక ప్రత్యేక విజ్ఞప్తి చేశారు. "నేను పవిత్రమైన తిరుమల శ్రీ బాలాజీ కొలువైన నేల నుంచి వచ్చాను. ఈ చారిత్రక కాశీ నగరంలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించాలనుకుంటున్నాం. దీని కోసం 5 నుంచి 10 ఎకరాల స్థలాన్ని కేటాయించాలని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను కోరుతున్నాను" అని అన్నారు. ఈ ప్రకటనకు సభికుల నుంచి భారీ స్పందన లభించింది. అయోధ్యలో రామమందిర నిర్మాణం చరిత్రాత్మకమని, వారసత్వ సంపదను కాపాడుతూనే అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లడం మోదీకే సాధ్యమైందని చంద్రబాబు అన్నారు.

### ఏపీకి అండగా ఎన్డీఏ

ఎన్డీఏ కూటమి బంధం విడదీయరానిదని చంద్రబాబు స్పష్టం చేశారు. "అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు విషయంలో కేంద్ర ప్రభుత్వం మాకు అండగా నిలిచింది. సహకార సమాఖ్య స్ఫూర్తి మాకు కేవలం నినాదం కాదు, అది మా రోజువారీ అనుభవం. మేం కలిసే ఉన్నాం, భవిష్యత్తులోనూ కలిసే ఉంటాం. మన ఐక్యతే దేశానికి బలం" అని పునరుద్ఘాటించారు. సరైన సమయంలో, సరైన ప్రదేశంలో, సరైన నాయకుడు ఉండటం దేశానికి లభించిన గొప్ప అదృష్టమని, ఆ నాయకుడే నరేంద్ర మోదీ అని చంద్రబాబు తన ప్రసంగాన్ని ముగించారు. ఆయన ప్రసంగానికి సభికులు లేచి నిలబడి చప్పట్లతో అభినందనలు తెలిపారు.

## హైదరాబాద్‌లో సెప్టెంబరు 25న

# గణేశ్ నిమజ్జనం

గణేశ్ మండపాల నిర్వాహకులు, ఊరేగింపులో పాల్గొనేవారు పోలీసుల నిబంధనలు, సూచనలను కచ్చితంగా పాటించాలని గోషామహల్ ఇన్‌స్పెక్టర్ బి. శ్రవణ్ కుమార్ తెలిపారు. పోలీసులు సూచించిన మార్గాల్లో, నిర్దేశిత సమయంలోనే ఊరేగింపులు జరపాలని, ట్రాఫిక్‌కు లేదా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలిగించవద్దని స్పష్టం చేశారు. గణేశ్ నిమజ్జనం రోజున హైదరాబాద్ వ్యాప్తంగా సుమారు 20,000 మంది పోలీసు సిబ్బందిని బందోబస్తు కోసం మోహరించనున్నారు. ఇటీవల పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్, జీహెచ్‌ఎంసీ, ఇతర శాఖల అధికారులతో కలిసి బాలాపూర్ నుంచి ట్యాంక్ బండ్ వరకు 19 కిలోమీటర్ల నిమజ్జన మార్గాన్ని తనిఖీ చేశారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దని, అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# రాష్ట్రంలో తీవ్ర కరవుపై ముందస్తు చర్యలు శూన్యం

రాష్ట్రంలో 51 శాతానికి పైగా వర్షపాతం లోటు నమోదైందని, మొత్తం 688 మండలాల్లో 628 మండలాలు తీవ్ర వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని ఈ సందర్భంగా తెలిపారు. ఎల్‌నినో ప్రభావం ఉంటుందని ముందే తెలిసినా కూటమి ప్రభుత్వం నివారణ చర్యలు చేపట్టడంలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. ఖరీఫ్‌లో సాధారణంగా 76 లక్షల ఎకరాల్లో సాగు జరగాల్సి ఉండగా కేవలం 56.4 లక్షల ఎకరాలకే పరిమితమైందని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. విత్తనం వేయలేకపోయిన రైతులకు ఎకరాకు రూ.15,000, పంట దెబ్బతిన్న రైతులకు ఎకరాకు రూ.25,000 చొప్పున ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. వీటితో పాటు ఉచిత పంటల బీమాను పునరుద్ధరించి పాత బకాయిలైన రూ.3,000 కోట్లను విడుదల చేయాలన్నారు. ఒక్కో రైతుకు అన్నదాత సుఖీభవ కింద పెండింగ్‌లో ఉన్న రూ.41,000 చెల్లించాలని సూచించారు. ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.6,000 కోట్లు అందించాలన్నారు. రాయలసీమ ప్రాజెక్టులకు నీటిని తరలించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని ఆరోపించారు. సాగునీటి రంగంలో ప్రభుత్వం అవలంబిస్తున్న తీరును తప్పుబడుతూ, పోలవరం నిల్వ సామర్థ్యంపై రాజీపడుతూ ఉనికి కోసం లిఫ్ట్ ప్రాజెక్టులతో డ్రామాలు ఆడుతున్నారని జగన్ విమర్శించారు. కరవు బారిన పడిన గ్రామీణ ప్రాంత ప్రజల కోసం అదనంగా 150 రోజుల ఉపాధి హామీ పనులు కల్పించాలని, తాగునీటి ఎద్దడి నివారణకు ఉచిత ట్యాంకర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు వైసీపీ క్షేత్రస్థాయి కార్యాచరణ చేపడుతుందని, త్వరలోనే తాను స్వయంగా కరవు ప్రాంతాల్లో పర్యటించి రైతులకు అండగా నిలుస్తానని స్పష్టం చేశారు.

# తెలంగాణలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు

ఫారం-18 దరఖాస్తుల స్వీకరణ పూర్తైన తర్వాత ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియ కొనసాగుతుంది. నవంబర్ 20వ తేదీన ముసాయిదా ఓటర్ల జాబితా ముద్రణ పూర్తి చేసి నవంబర్ 25వ తేదీన డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. అదే రోజు నుంచి డిసెంబర్ 10వ తేదీ వరకు ఓటర్ల నుంచి క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరించనున్నారు. అందిన అభ్యంతరాలు, క్లెయిమ్‌లను పరిశీలించి డిసెంబర్ 25వ తేదీ నాటికి పరిష్కరించనున్నారు. ఆ తర్వాత అన్ని ప్రక్రియలు పూర్తిచేసి డిసెంబర్ 30వ తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. ఈసారి ఓటర్ల నమోదులో ఒక ముఖ్యమైన అంశాన్ని ఎన్నికల అధికారులు స్పష్టం చేశారు. ఇప్పటికే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాలో పేరు ఉన్నవారు కూడా కొత్తగా ఫారం-18 దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని తేల్చి చెప్పారు. గతంలో ఓటరుగా నమోదయ్యామని భావించి ఈసారి దరఖాస్తు చేయకుండా ఉండకూడదని అధికారులు సూచించారు. ఫారం-18తో పాటు విద్యార్హతకు సంబంధించిన అవసరమైన ధ్రువపత్రాలు, సర్టిఫికెట్ల ధ్రువీకరించిన కాపీలను సమర్పించాల్సి ఉంటుంది. గ్రాడ్యుయేట్స్ నియోజకవర్గాల ఓటర్ల నమోదుకు ఫారం-18నే ఉపయోగిస్తారు. గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ నియోజకవర్గంలో ఓటరుగా నమోదు కావాలంటే ఎన్నికల నిబంధనల ప్రకారం సంబంధిత నియోజకవర్గంలో సాధారణ నివాసిగా ఉండటంతో పాటు, నిర్ణయించిన అర్హత తేదీకి ముందు కనీసం 3 ఏళ్లుగా గుర్తింపు పొందిన యూనివర్సిటీ, ఇతర గుర్తింపు పొందిన సంస్థ నుంచి డిగ్రీ లేదా దానికి సమానమైన విద్యార్హత కలిగి ఉండాలి. 2027 మార్చిలో ఖాళీ కానున్న 2 స్థానాల కోసం ఈ ఓటర్ల జాబితా సిద్ధం చేయనున్నారు. తుది ఓటర్ల జాబితా ప్రచురణ తర్వాత ఈ 2 స్థానాలకు ఎన్నికల నిర్వహణకు సంబంధించిన తదుపరి ప్రక్రియ కొనసాగుతుంది. అయితే ప్రస్తుతం ప్రకటించింది ఓటర్ల జాబితా తయారీ షెడ్యూల్ మాత్రమేనని పోలింగ్ తేదీ, నామినేషన్లు, ఇతర ఎన్నికల కార్యక్రమాలపై పూర్తి షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం ప్రత్యేకంగా ప్రకటించాల్సి ఉంటుంది. సెప్టెంబర్ 28వ తేదీన ఓటర్ల జాబితా ప్రక్రియపై ప్రజా నోటీసు అక్టోబర్ 15వ తేదీన పత్రికల్లో తొలి పునఃప్రచురణ అక్టోబర్ 25వ తేదీన రెండో పునఃప్రచురణ నవంబర్ 6వ తేదీన ఫారం-18 దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ నవంబర్ 20వ తేదీన ముసాయిదా జాబితా ముద్రణ పూర్తి నవంబర్ 25వ తేదీ ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ నవంబర్ 25వ తేదీ నుంచి డిసెంబర్ 10వ తేదీ వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ డిసెంబర్ 25వ తేదీన క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారం డిసెంబర్ 30 తేదీన తుది ఓటర్ల జాబితా ప్రచురణ చేయనున్నారు. అర్హత ఉన్న పట్టభద్రులు గడువు ముగిసేలోపు ఫారం-18ను సమర్పించడంతో పాటు ముసాయిదా ఓటర్ల జాబితా విడుదలైన తర్వాత తమ పేరు, ఇతర వివరాలను తప్పనిసరిగా పరిశీలించుకోవడం కీలకమని ఎన్నికల అధికారులు పేర్కొన్నారు. గతంలో ఓటరుగా ఉన్నవారు కూడా ఈసారి కొత్తగా దరఖాస్తు చేయాల్సి ఉండటంతో ఈ అంశంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాల్సి ఉంటుంది.

# హైదరాబాద్‌లో 'హార్వర్డ్' కోర్సులు

ఏర్పాటు చేసే ప్రక్రియను ప్రారంభించాయని చెప్పారు.

### పరిశోధనలకు ఊతం

విదేశీ విద్యాసంస్థలు తెలంగాణకు రావడం వల్ల స్థానిక విశ్వవిద్యాలయాలు, పరిశ్రమలతో కలిసి పనిచేసే అవకాశం పెరుగుతుందని సీఎం అన్నారు. రాష్ట్రంలోనే పరిశోధనలు చేపట్టేందుకు వీలు కలుగుతుందని చెప్పారు. యూకేకు చెందిన అత్యుత్తమ బిజినెస్ స్కూళ్లు తెలంగాణలో ఏర్పాటైతే ప్రపంచస్థాయి కార్పొరేట్ సంస్థలు రాష్ట్రం వైపు ఆకర్షితులవుతాయని పేర్కొన్నారు. అదే సమయంలో తెలంగాణ విద్యార్థులు, అధ్యాపకులకు అంతర్జాతీయ సంస్థలతో కలిసి పనిచేసే అవకాశం, అంతర్జాతీయ అనుభవం, ప్రపంచస్థాయి అవకాశాలు అందుబాటులోకి వస్తాయని వివరించారు. హార్వర్డ్, ఎంఐటీ, లండన్ యూనివర్సిటీ, వర్జీనియా టెక్, నార్త్‌ఈస్టర్న్ యూనివర్సిటీ తదితర ప్రముఖ అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలతో ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్‌లు, డ్యూయల్ డిగ్రీ కోర్సులు, అధ్యాపకుల శిక్షణ, పరిశోధన తదితర రంగాల్లో భాగస్వామ్యాలను ప్రారంభించవచ్చని చెప్పారు. విద్యార్థుల్లో ఇంగ్లిష్, జర్మన్, జపనీస్ వంటి విదేశీ భాషలపై నైపుణ్యాన్ని పెంచేందుకు కూడా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.

### ఫ్యూచర్ సిటీలో ఎడ్యుకేషన్ హబ్

మారుతున్న మార్కెట్ అవసరాలకు అనుగుణంగా యువతకు అత్యాధునిక నైపుణ్య శిక్షణ అందించేందుకు భారత్ ఫ్యూచర్ సిటీలో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నామని సీఎం వెల్లడించారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా అభివృద్ధి చేస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీని దాదాపు 30 వేల ఎకరాల విస్తీర్ణంలో దేశంలోనే తొలి నెట్-జీరో గ్రీన్‌ఫీల్డ్ స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. ఫ్యూచర్ సిటీలో ఎడ్యుకేషన్ హబ్‌ను ఏర్పాటు చేయడం ద్వారా భావితరాలకు మరిన్ని ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. విద్య, పరిశ్రమలు, నైపుణ్యాభివృద్ధి రంగాలను అనుసంధానం చేసేలా భవిష్యత్ నగరాన్ని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.

### 'ఇన్వెస్ట్ తెలంగాణ'కు ఆహ్వానం

డిసెంబర్‌లో నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్--2026'కు యూకే బిజినెస్ స్కూళ్ల ప్రతినిధుల బృందాన్ని సీఎం ఆహ్వానించారు. యూకే విద్యా వ్యవస్థలోని ప్రముఖులందరినీ గ్లోబల్ సమ్మిట్‌కు ప్రత్యేకంగా ఆహ్వానించనున్నట్లు తెలిపారు. దావోస్‌లో జరిగే వరల్డ్ ఎకనామిక్ ఫోరం తరహాలో 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'ను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. ఫ్యూచర్ సిటీలో భారీ పెట్టుబడులు పెట్టేందుకు ప్రపంచ అగ్రగామి సంస్థలు ముందుకొస్తున్నాయని పేర్కొన్నారు. టీసీఎస్ రూ.70 వేల కోట్లతో దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్‌ను నిర్మించనుందని సీఎం తెలిపారు. అమెజాన్ ఇప్పటికే రూ.లక్ష కోట్ల పెట్టుబడితో డేటా సెంటర్ నిర్మాణాన్ని చేపట్టిందని చెప్పారు.

### విద్యా వ్యవస్థలో సమూల మార్పులు

ప్రపంచంలోని అత్యుత్తమ విశ్వవిద్యాలయాలు, ఫార్చ్యూన్-500 కంపెనీలు తెలంగాణలో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రేవంత్‌రెడ్డి అన్నారు. నర్సరీ నుంచి ఉన్నత విద్య వరకు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతోపాటు.. ఐటీఐలు, పాలిటెక్నిక్ కాలేజీలు, స్కిల్స్ యూనివర్సిటీల ద్వారా యువతలో నైపుణ్యాలను పెంపొందించడమే ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ తదితర కార్యక్రమాల ద్వారా రాష్ట్ర విద్యా వ్యవస్థను సమూలంగా మార్చాలని ప్రభుత్వం భావిస్తోందని తెలిపారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వివరించారు.

# రాజకీయ ఖైదీల విడుదల కోరుతూ ఈ నెల 19న విజయవాడ ధర్నా చౌక్ లో ధర్నా

**నరసరావుపేట** రాజకీయ ఖైదీల విడుదలను కోరుతూ ఈ నెల 19న విజయవాడ ధర్నా చౌక్ లో జరగనున్న ధర్నాకు సంబంధించిన కరపత్రాన్ని నరసరావుపేట తహసిల్దార్ కార్యాలయం వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, న్యాయవాదులు, పర్యావరణ వేత్తలు, ప్రొఫెసర్లు, విద్యార్థులు, సామాజిక కార్యకర్తలు, విప్లవకారులు సుమారు 15 వేల మంది వివిధ జైళ్లలో మగ్గుతున్నారని, వారికి కనీసం బెయిల్ కూడా లభించని పరిస్థితి నెలకొందన్నారు. (ఉపా) వంటి నిర్బంధ చట్టాల కారణంగా న్యాయస్థానాలు సైతం వారికి బెయిల్ మంజూరు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వారిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ, రాష్ట్రవ్యాప్తంగా వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు, పౌర హక్కుల సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీ ఉదయం 10 గంటలకు విజయవాడ ధర్నా చౌక్ లో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

# కేసీఆర్ పుట్టుకతోనే కుబేరుడు

గతంలో ప్రగతి భవన్‌లో 150 బెడ్‌రూమ్‌లు, బంగారు బాత్‌రూమ్‌లు ఉన్నాయంటూ చేసిన ప్రచారంలో ఎంత నిజముందో, ప్రస్తుత భూముల ఆరోపణల్లోనూ అంతే నిజముందని కొట్టిపారేశారు. కేసీఆర్ కుటుంబ ఆస్తుల చరిత్రను వివరిస్తూ, కేసీఆర్ తండ్రి కాలం నుంచే తమకు వందలాది ఎకరాల వ్యవసాయ భూమి ఉందో రేవంత్ రెడ్డి గ్రహించాలని కేటీఆర్ హితవు పలికారు. కేసీఆర్ పుట్టినప్పుడే వారి సొంత ఇల్లు రెండు ఎకరాల్లో ఉండేదని, చింతమడకలోని ఆ ఇంటిని కూడా ప్రభుత్వ పాఠశాల కోసం రాసిచ్చిన ఉదారత కేసీఆర్‌దని గుర్తుచేశారు. జూబ్లీహిల్స్‌లో ప్యాలెస్‌లు కట్టుకున్న రేవంత్ రెడ్డికి లేని బాధ మొదటి నుంచీ రైతు కుటుంబమైన కేసీఆర్ వ్యవసాయం చేసుకోవడానికి భూమి ఉంటే ఎందుకని ప్రశ్నించారు. కేసీఆర్ ను నువ్వు దొర అంటావా లేక ఈ మధ్యే ఆస్తులు సంపాదించుకున్నాడు అంటావా? ఏదో ఒకటి ముందు ఫిక్స్ అవ్వు అని రేవంత్ రెడ్డికి సూచించారు. తన వ్యక్తిగత సంపాదనపై వస్తున్న విమర్శలకు స్పందిస్తూ, తా తాను అమెరికాలో ఆరున్నరేళ్లు ఉద్యోగం చేసి కష్టపడి సంపాదించుకున్నానని కేటీఆర్ స్పష్టం చేశారు. గోడల మీద పెయింట్లు వేసుకునే నీ సంగతి నాకు తెలియదా.. కొండారెడ్డిపల్లి పోయి అడిగితే నీ బతుకంతా బయటపడుతుంది అంటూ రేవంత్ రెడ్డిపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. 7 ఏళ్లు డిగ్రీ చదివిన రేవంత్‌కి కనీస అవగాహన లేదని ఎద్దేవా చేశారు. అసెంబ్లీలో రేవంత్ రెడ్డి చదివిన భూముల లెక్కల జాబితాను కేటీఆర్ తీవ్రంగా తప్పుపట్టారు. తమకు ఎలాంటి సంబంధం లేని వ్యక్తుల ఆస్తులను కూడా కేసీఆర్ ఖాతాలో కలపడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కూకట్‌పల్లిలోని కొండల్ రావు, నవీన్ రావు వంటి నేతలకు, కేసీఆర్ కుటుంబానికి ఎలాంటి చుట్టరికం లేదని కేవలం వారు వెలమ కులానికి చెందినవారు కావడం వల్లే వారి ఆస్తులను కూడా కేసీఆర్ ఖాతాలో వేశారా అని నిలదీశారు. కేసీఆర్ అక్కాచెల్లెళ్లు, అన్నదమ్ముల సంతానం దాదాపు 300 మంది ఉంటారని, వారి ఆస్తులన్నింటినీ సీఎం తన లెక్కల్లో చూపడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. నీ అన్నదమ్ముల పిల్లల ఆస్తులను నీ ఖాతాలో వేస్తే ఊరుకుంటావా అని సూటిగా ప్రశ్నించారు. కేసీఆర్ ఎన్నికల అఫిడవిట్‌లో 67 ఎకరాల భూమి ఉందనే విషయాన్ని స్పష్టంగా పేర్కొన్నారని, దాన్ని కొత్తగా రేవంత్ రెడ్డి కనిపెట్టిందేమీ లేదని కేటీఆర్ కొట్టిపారేశారు. తమ కుటుంబం 1954 నుంచే వ్యవసాయం చేసుకుంటోందని, నిబంధనలకు కట్టుబడి చట్టప్రకారమే భూములు కొనుగోలు చేశామని స్పష్టం చేశారు. కేసీఆర్ భూమిని దేవతలా పూజిస్తారని రేవంత్ రెడ్డిలాగా మంది కొంపలు ముంచి భూములను ఆటవస్తువుగా చూడరని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, కేసీఆర్‌కు బేషరతుగా క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై అబద్ధపు కూతలు కూసిన రేవంత్ రెడ్డి నిజాలు బయటపడటంతో ఆత్మరక్షణలో పడ్డారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చే హామీలు, ఆరు గ్యారంటీల మాదిరిగానే రేవంత్ రెడ్డి ఆరోపణలు కూడా నీటిమూటలేనని కొట్టిపారేశారు.

## సున్నా నుంచి వేల కోట్ల ఆస్తులకు

# ఎదిగిన భూ బకాసురుడు కేసీఆర్

ఆస్తుల వివరాలను ప్రస్తావిస్తూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పలు ప్రశ్నలు సంధించారు. 2004 లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన కేసీఆర్ తనకు భూమి లేదని ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారని చెప్పారు. ఆ తర్వాతి కాలంలో ఆయన కుటుంబానికి భారీగా భూములు, ఆస్తులు ఎలా సమకూరాయని ప్రశ్నించారు. కేసీఆర్ ఆస్తుల విషయంలో ఎన్నికల అఫిడవిట్‌లే కీలక ఆధారాలని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ కాలం నుంచి బీఆర్‌ఎస్ ప్రభుత్వం 10 ఏళ్ల పాటు అధికారంలో ఉన్న సమయంలో కేసీఆర్ కుటుంబ ఆస్తులు భారీగా పెరిగాయని మంత్రి పొంగులేటి తీవ్ర ఆరోపణలు గుప్పించారు. 2004 కరీంనగర్ లోక్‌సభ ఎన్నికల సందర్భంగా కేసీఆర్ సమర్పించిన అఫిడవిట్‌లో తన పేరుపై వ్యవసాయ భూమి, ఇతర భూములు లేవని పేర్కొన్నట్లు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. అనంతరం ఎన్నికల అఫిడవిట్‌లలో కనిపించే ఆస్తుల వివరాలను ప్రస్తావిస్తూ ఈ మార్పులకు కారణం ఏంటని నిలదీశారు. ఎన్నికల అఫిడవిట్‌లలో అభ్యర్థులు స్వయంగా ప్రకటించే ఆస్తుల వివరాలు నమోదవుతాయి. వాటిలో భూములు, ఇళ్లు, వాణిజ్య ఆస్తులు, ఇతర స్థిరాస్తులు, అప్పులు వంటి అంశాలను తప్పకుండా పేర్కొనాల్సి ఉంటుంది. కేసీఆర్ కుటుంబ ఆస్తుల పెరుగుదలపై తీవ్ర ఆరోపణలు చేసిన మంత్రి పొంగులేటి.. బీఆర్‌ఎస్ హయాంలో ప్రభుత్వ భూములు, పేదలు, దళితులకు చెందిన అసైన్డ్ భూముల విషయంలో భారీ ఎత్తున అక్రమాలు చోటు చేసుకున్నాయని ఆరోపించారు. ఆ భూముల కారణంగానే కేసీఆర్ కుటుంబానికి భారీ స్థాయిలో ఆస్తులు సమకూరాయని విమర్శలు గుప్పించారు. మరోవైపు.. కేసీఆర్ భూముల విషయంలో కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపైనా మంత్రి పొంగులేటి మండిపడ్డారు. పుట్టుకతోనే కేసీఆర్‌కు వందల ఎకరాల భూములు ఉన్నాయని చెబుతున్న కేటీఆర్‌పైనా పొంగులేటి విమర్శలు చేశారు. అలాంటి వాదనలకు, ఎన్నికల అఫిడవిట్‌లలో నమోదైన వివరాలకు మధ్య వ్యత్యాసం ఉంటే దానిపై వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ఆస్తుల విషయంలో అఫిడవిట్‌లో తప్పులు నమోదయ్యాయా లేక ప్రజలకు వేరే వివరాలు చెబుతున్నారా అని కేటీఆర్‌ను ఉద్దేశించి పొంగులేటి ప్రశ్నించారు. తెలంగాణలో గత కొంతకాలంగా భూములు, 22ఏ నిషేధిత జాబితా, అసైన్డ్ భూములు, ప్రభుత్వ భూముల అంశాలు అధికార, ప్రతిపక్షాల మధ్య రాజకీయ వివాదానికి కేంద్రంగా మారుతున్నాయి. ఇటీవల రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో 22ఏ జాబితాలో భూముల సమస్య పెరిగిందని ఆరోపించారు. దీనిపై బీఆర్‌ఎస్ నేతలు కూడా స్పందిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే తాజాగా కేసీఆర్ ఎన్నికల అఫిడవిట్‌లలోని ఆస్తుల వివరాలను ప్రస్తావిస్తూ పొంగులేటి చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

## మీ మనస్తత్వం మార్చుకోండి..

# హిందీని వద్దంటే కుదరదు

పాటించాలని, ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్చల ద్వారా విభేదాలను పరిష్కరించుకోవాలని సూచించింది. జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్‌లతో కూడిన ధర్మాసనం గురువారం ఈ అంశంపై విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ధర్మాసనం పలు కీలక వ్యాఖ్యలు చేస్తూ, "మీరు మీ మనస్తత్వాన్ని మార్చుకోవాలి. నవోదయ విద్యాలయాలు కేంద్రం ఇస్తోంది వీటి వల్ల తమిళనాడు ప్రమాణాలేమీ తగ్గిపోవు. సహకార సమాఖ్య స్ఫూర్తితో మెలగాలి. ఢిల్లీ ప్రజలు చెన్నై వారిని, అలాగే చెన్నై ప్రజలు ఢిల్లీ వారిని దూరం చేసుకోకూడదు" అని హితవు పలికింది. నవోదయ పాఠశాలల ఏర్పాటు ద్వారా తమిళనాడులో విద్యావకాశాలు మరింత మెరుగుపడతాయని కోర్టు అభిప్రాయపడింది.

### వివాదం నేపథ్యం ఇదే

కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిచే నవోదయ విద్యాలయాలు త్రిభాషా సూత్రాన్ని (హిందీతో సహా) అనుసరిస్తాయి. అయితే, తమిళనాడులో ద్విభాషా విధానం అమలవుతుండటంతో, హిందీని తప్పనిసరి చేయడాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఇది తమ విద్యా విధానానికి విరుద్ధమని వాదిస్తోంది. అంతేకాకుండా, ఇది ఒక ఐచ్ఛిక పథకమని, దీనిని కచ్చితంగా అమలు చేయాలని న్యాయస్థానం ఆదేశించలేదని పేర్కొంటోంది. ఈ నేపథ్యంలో, ప్రతి జిల్లాలో ఆరు వారాల్లోగా స్థలాలను గుర్తించాలని 2025 డిసెంబర్ 15న సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ ఆదేశాలను వెనక్కి తీసుకోవాలని తమిళనాడు ప్రభుత్వం కోరగా, ధర్మాసనం అందుకు నిరాకరించింది. స్థలాల గుర్తింపు కోసం మరో మూడు నెలల గడువు ఇస్తూ, తదుపరి విచారణను డిసెంబర్ 14కి వాయిదా వేసింది. అయితే, తక్షణమే భూసేకరణ చేయాలని తాము చెప్పడం లేదని, కేవలం అనువైన ప్రభుత్వ స్థలాలను గుర్తించాలని మాత్రమే ఆదేశిస్తున్నామని కోర్టు స్పష్టం చేసింది. భాషా విధానంపై నెలకొన్న సమస్యలను కేంద్రంతో చర్చించి పరిష్కరించుకోవాలని సూచించింది.

# శ్రీశైలం దేవస్థానానకి విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పర్యటన



శ్రీశైలం (ప్రశ్న న్యూస్) బొండాడ ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ ను ప్రారంభించిన మంత్రి గొట్టిపాటి. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు బుడ్డా రాజశేఖర రెడ్డి, ఉగ్ర నరసింహారెడ్డి, అశోక్ రెడ్డి, నారాయణరెడ్డి. అనంతరం ప్రధాని జన్మదినం సందర్భంగా ఆశీర్వాద దీపం వెలిగించిన సంఘీభావం తెలిపిన మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యేలు. దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం అంకితభావంతో సేవలందిస్తున్న వ్యక్తి నరేంద్ర మోదీ. ప్రధాని మోదీ సారథ్యంలో దేశంలో మౌలిక సదుపాయాల కల్పన యజ్ఞంలా కొనసాగుతోంది. 'సబ్ కా సాత్--సబ్ కా వికాస్' నినాదంతో పేదరిక నిర్మూలనకు కృషి చేస్తున్నారు. భారత్‌ను అన్నీ రంగాల్లో ప్రథమ స్థానంలో నిలిపేందుకు ప్రధాని మోదీ కృషి చేస్తున్నారు.

## సెప్టెంబర్ 17ను అధికారిక స్వాతంత్ర్య దినోత్సవంగా నిర్వహించాలి

- తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరుల త్యాగాలను స్మరించుకోవాలి
- కామ్రేడ్ ఎం.కె. మొహినుద్దీన్‌ను సన్మానించిన భారత కమ్యూనిస్టు పార్టీ నాయకులు బట్టు దయానంద రెడ్డి



**గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )** సెప్టెంబర్ 17కు తెలంగాణ చరిత్రలో ప్రత్యేక స్థానం ఉందని భారత కమ్యూనిస్టు పార్టీ నాయకులు పేర్కొన్నారు. హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమైన సెప్టెంబర్ 17ను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా స్వాతంత్ర్య దినోత్సవంగా నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. భారతదేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ, హైదరాబాద్ సంస్థానాన్ని నిజాం పాలనలోనే కొనసాగించేందుకు ప్రయత్నాలు జరిగాయని వారు తెలిపారు. ఆ సమయంలో ఆంధ్ర మహాసభ, భారత కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం జరిగిందని దయానంద రెడ్డి పేర్కొన్నారు. వెట్టి చాకిరీ, భూస్వామ్య విధానానికి వ్యతిరేకంగా జరిగిన ఈ పోరాటంలో సుమారు నాలుగు వేల మంది అమరులయ్యారని తెలిపారు. 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమైందని, ఈ నేపథ్యంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొన్న వారి త్యాగాలను చరిత్రలో గుర్తించాలని వారు అన్నారు. అయితే హైదరాబాద్ సంస్థానం విముక్తికి సంబంధించిన చారిత్రక పరిణామాలపై భిన్నమైన రాజకీయ, చారిత్రక వివరణలు ఉన్నాయని పేర్కొన్నారు. రైతాంగ పోరాటానికి ప్రత్యక్ష సాక్షి మొహినుద్దీన్‌తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొన్న శతాధిక వయస్కుడైన కామ్రేడ్ ఎం.కె. మొహినుద్దీన్‌ను సెప్టెంబర్ 17 సందర్భంగా కలిసి ఆయన అనుభవాలను తెలుసుకుని సన్మానించారు. మొహినుద్దీన్ మంగోల్ గ్రామానికి చెందినవారని, ఆ కాలంలో సుమారు ఎనిమిది గ్రామాల్లో 300 ఎకరాల వరకు భూమి కలిగిన భూస్వామిగా ఉన్నారని నాయకులు తెలిపారు. అనంతరం కమ్యూనిస్టు పార్టీ పిలుపుతో ప్రభావితమై తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో భాగస్వాములయ్యారని, తన ఆధీనంలోని భూములను పేదలకు పంచారని పేర్కొన్నారు. సెప్టెంబర్ 17ను ప్రభుత్వం విలీన దినోత్సవం, విమోచన దినోత్సవం లేదా ప్రజాపాలన దినోత్సవంగా ఏ పేరుతో పిలిచినా, అధికారికంగా స్వాతంత్ర్య దినోత్సవంగా నిర్వహించాలని భారత కమ్యూనిస్టు పార్టీ తరఫున డిమాండ్ చేశారు.

## బోయిన్ పల్లి మార్కెట్‌లో షాపింగ్ కాంప్లెక్స్:ఎమ్మెల్యే

- మార్కెటింగ్ డిపార్ట్మెంట్ అధికారుల రూటే సపరేట్.?
- డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ లో వ్యాపార సముదాయాల భవన నిర్మాణానికి ఆహ్వానం ఎంపీ,ఎమ్మెల్యేకి వివరాలు తెలియక భూమి పూజ కార్యక్రమంలో అధికారులతో చర్చ.?
- స్థానిక ఎమ్మెల్యే శ్రీ గణేష్ మార్కెట్ అధికారులను నూతన భవన నిర్మాణం వివరాలు అడిగి తెలుసుకున్నారు.
- అసోసియేషన్ అధ్యక్షుడు సోమ మార్కెట్ లో మౌళిక సమస్యలు పై ఎమ్మెల్యే కి విన్నపాలు.
- "చిట్టి కథ"చెప్పిన ఎమ్మెల్యే, త్వరలో అన్ని సమస్యలు పరిష్కారం.
- ఎంపీ ఈటల పై స్థానిక ఎమ్మెల్యే శ్రీ గణేష్ కి అమితమైన ప్రేమ, రాజేందర్ కోసం స్థానిక రారాజు "45"నిమిషాలు నిరీక్షణ.

**కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్)** డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ లో కోటి అరవై లక్షల రూపాయలతో నూతన వ్యాపార సముదాయాల భవన నిర్మాణానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే శ్రీ గణేష్,మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ కార్యక్రమంలో పాల్గొన్నారు. బోయిన్ పల్లి మార్కెట్ ని ఆనుకొని ఉన్న పెట్రోల్ బంక్ పక్కన జీంవన్ భవన నిర్మాణం చేపడుతున్నట్లు మార్కెటింగ్ డిపార్ట్మెంట్ వెల్లడించారు. త్వరలో ఈ నిర్మాణ పనులు వేగవంతం అవుతాయని గుత్తేదారులు సైతం పేర్కొన్నారు. అలాగే వెడల్పు 12 అడుగులు, పొడవు 14 అడుగులతో ఒక్కోక్క షాపు నిర్మాణం చేపడుతున్నట్లు మార్కెటింగ్ డిపార్ట్మెంట్ ఈఈ శ్రీకాంత్ తెలిపారు. భవిష్యత్తులో మరో ఆణిముత్యం బోయిన్ పల్లి మార్కెట్ ముందు ఆవిష్కరిస్తుంది. మార్కెట్లో కమీషన్ ఏజెంట్లు గా కొనసాగుతున్న వ్యక్తులు, రైతులు,అర్హులైన వారికి ఈ దుకాణాలు కేటాయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.? ఈ వ్యాపార సముదాయాల భవనంలో సుమారు "20" షాపులు అందుబాటులోకి రానున్నాయి.



### కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ మాట్లాడుతూ:

ఆసియాలోనే అతిపెద్ద మార్కెట్ డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ ని,నిత్యం "27"వేల టన్నుల కూరగాయలు బోయిన్ పల్లి మార్కెట్ కి దిగుమతి అవుతున్నాయి. అలాగే సగటున ప్రతి రోజూ "25"వేల మంది రాకపోకలు సాగిస్తున్నారు. అదిగాక మార్కెట్ కి వార్షిక ఆదాయం సుమారు:14 కోట్ల రాబడి ఉంది అంటేనే అర్థం చేసుకోవచ్చని స్థానిక ఎమ్మెల్యే శ్రీ గణేష్ విలేకరుల సమావేశంలో తెలిపారు. మరో విషయం ఏమిటంటే బోయిన్ పల్లి మార్కెట్ లో మరో అద్భుతమైన నిర్మాణం చేపడుతున్నట్లు,దాని వల్ల కొంతమందికి లబ్ది చేకూరుతుందని ఆయన అన్నారు. అసలు కొంతకాలంగా బోయిన్ పల్లి మార్కెట్ లో అభివృద్ధి స్తంభించింది. దానికి కారణం గత ప్రభుత్వం పాలననే. అన్నీ శాఖల నుంచి ఆదాయాన్ని "కాళేశ్వరం ప్రాజెక్టు"నిర్మాణం కోసం వెచ్చించిన గత సర్కార్.

ప్రస్తుతం అన్ని డిపార్ట్మెంట్ ల్లో సమస్యలు నెలకొన్నాయి. ఈ పాపం కేసిఆర్ దే నన్నారు. అలాగే సికింద్రాబాద్ వెజిటబుల్ కమీషన్ ఏజెంట్ల అసోసియేషన్ అధ్యక్షుడు సోమ దేవేందర్ రెడ్డి తో గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను ఒక్కొక్కటిగా సిఎం రేవంత్ రెడ్డి పరిశీలిస్తూ పరిష్కారి స్తున్నారని,త్వరలో బోయిన్ పల్లి మార్కెట్ సమస్యలు కూడా దఫాలు వారిగా పరిష్కారాలు అవుతాయని కమీషన్ ఏజెంట్లకు సర్ది చెప్పారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ బోయిన్ పల్లి మార్కెట్ లో వ్యాపార సముదాయాల భవనం ప్రారంభోత్సవంలో పాల్గొన్నడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ బోయిన్ పల్లి మార్కెట్ లో స్థానికంగా నెలకొన్న మౌళిక సమస్యలు తాండవం ఆడుతున్నాయని ఎంపీ ఈటల రాజేందర్ ఆవేదన వ్యక్తంచేశారు. వాస్తవానికి రాష్ట్ర ప్రభుత్వం చేయాల్సిన పనులు చేయక అందర్నీ ఇబ్బందులకు గురి చేస్తున్న విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. కేంద్రం రాష్ట్ర ప్రభుత్వానికి భారం కాకుండా రైల్వే ట్రాక్ పక్కన సర్వీస్ రోడ్డును కేంద్ర నిధులతో పనులు చేస్తున్నట్లు ఆయన గుర్తు చేశారు. అభివృద్ధి విషయంలో "నీ నా " తారతమ్యాలు లేకుండా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పని చేస్తూ అభివృద్ధితో ముందుకు సాగాలన్నారు. అలిగే నా సహాయ సహకారాలు ఎప్పటి ఉంటాయని, త్వరలో సంబంధిత వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మెల నాగేశ్వరరావు కి లేఖ రాసి,పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్తామని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ విలేకరుల సమావేశంలో తెలిపారు.

### పాలకులు,అధికారులు ఉన్న ఏది భరోసా:సోమ.

సికింద్రాబాద్ వెజిటబుల్ కమీషన్ ఏజెంట్ల అసోసియేషన్ అధ్యక్షుడు సోమ దేవేందర్ రెడ్డి మార్కెట్ లో నెలకొన్న మౌళిక సమస్యల పై ఆవేదన వ్యక్తంచేశారు.

ఎంత మంది వచ్చిన మా విషయంలో మాత్రం ఎటువంటి మార్పులు చేర్పులు చోటు చేసుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. రెండున్న దశాబ్దాల బోయిన్ పల్లి మార్కెట్ చరిత్రలో మునుపెన్నడూ లేనంత విధంగా సమస్యలు తాండవం ఆడుతున్నాయని మార్కెటింగ్ డిపార్ట్మెంట్ అధికారులు,పాలకులు మావైపు చూసిన దాఖలాలు లేవని,కానీ మార్కెట్ ఫీజు మాత్రం క్రమం తప్పకుండా చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటారని,వీటి మీద ఉన్న శ్రద్ధ కాస్త మార్కెట్ లో కమీషన్ ఏజెంట్లు, ఖరీదు దారులు,హమాలీలను దృష్టిలో ఉంచుకొని అభివృద్ధి చేస్తే బాగుంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈకార్యక్రమంలో బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ రాగిరి ఆనంద్ బాబు, సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మదా,నల్లోల రాజేందర్, కృష్ణ రెడ్డి,ప్రభాకర్,అవినాష్ రెడ్డి, రాము,దుర్గ ప్రసాద్,సంత్ జూలియస్,మహ్మద్ అస్లాం, మహ్మద్ పాషా,సంతోష్ కుమార్,సికింద్రాబాద్ వెజిటబుల్ కమీషన్ ఏజెంట్ల అసోసియేషన్ కార్యదర్శి ఆర్వీసీ చంద్రారెడ్డి,ఉపాధ్యక్షుడు మిర్యాలశ్రీనివాస్,అంజి,బిక్షపతి, చంద్రశేఖర్, మార్కెట్ అధికారులు బోయిన్ పల్లి మార్కెట్ సెక్రటరీ ఈ.వెంకటేశం, మార్కెట్ యార్డు ఇంచార్జ్ మధులిక,డిఇఓ మధు, సూపర్వైజర్లుమహ్మద్ కలీద్,రాజేందర్,అసిస్టెంట్ సెక్రటరీ మేడ్చల్ శ్రీనివాస్, టి పిసిసి సెక్రటరీ రాజేష్ యాదవ్, మురళీ ముదిరాజ్,నాల్గో వార్డు మురళీ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యాన రంగంలో ఆధునిక సాంకేతికతను విస్తృతంగా వినియోగించాలి

- కృత్రిమ మేధస్సు, డ్రోన్ సాంకేతికత, సెన్సార్ ఆధారిత వ్యవసాయంపై దృష్టి సారించాలి
- తెలంగాణ ప్రజాపాలన దినోత్సవంలో ఉపకులపతి డా. దండ రాజిరెడ్డి





**గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )** ములుగు, శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయంలో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయ ఉపకులపతి డా. దండ రాజిరెడ్డి అధ్యక్షత వహించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం వ్యవసాయ, ఉద్యాన రంగాల్లో గణనీయమైన అభివృద్ధి చోటుచేసుకుంటోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన పంటల సాగు విస్తీర్ణాన్ని పెంచడంతో పాటు రైతులకు అధిక ఆదాయం అందించేలా పలు ప్రోత్సాహక చర్యలు చేపడుతోందని తెలిపారు. మారుతున్న వాతావరణ పరిస్థితులు, మార్కెట్ అవసరాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ, ఉద్యాన రంగాల్లో నూతన ఆవిష్కరణలు, పరిశోధనలకు మరింత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత కృత్రిమ మేధస్సు యుగంలో సాంకేతిక పరిజ్ఞానం వేగంగా మారుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ తమ నైపుణ్యాలను ఎప్పటికప్పుడు నవీకరించుకోవాలని సూచించారు. విశ్వవిద్యాలయ బోధనా, బోధనేతర సిబ్బందితో పాటు విద్యార్థులు కూడా సదస్సులు, కార్యశాలలు, శిక్షణా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని నూతన సాంకేతికతలను నేర్చుకోవాలని అన్నారు. ముఖ్యంగా కృత్రిమ మేధస్సు, సెన్సార్ ఆధారిత వ్యవసాయం, డ్రోన్ సాంకేతికత వంటి ఆధునిక పరిజ్ఞానాన్ని వ్యవసాయ, ఉద్యాన రంగాల అభివృద్ధికి అన్వయించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డా. ఏ. భగవాన్, ఉద్యానశాస్త్ర విభాగం డీన్ మరియు విద్యార్థి వ్యవహారాల డీన్ జె. చీనా, పరిశోధనా విభాగం సంచాలకులు డా. డి. లక్ష్మీనారాయణ, విస్తరణ విభాగం సంచాలకులు మరియు స్నాతకోత్తర విద్యా విభాగం డీన్ డా. టి. సురేష్ కుమార్, పరీక్షల నియంత్రణాధికారి మరియు అంతర్జాతీయ కార్యక్రమాల సంచాలకులు డా. ఎన్. శ్రీనివాసన్, విశ్వవిద్యాలయ సలహాదారు డా. కె. వీరాంజనేయులు, బాధ్యతాధికారి డా. డి. విజయ, ప్రణాళిక మరియు పర్యవేక్షణ విభాగం సంచాలకులు డా. డి. అనితా కుమారి, విద్యార్థులు, బోధనా, బోధనేతర, పొరుగు సేవా సంస్థల ద్వారా పనిచేసే సిబ్బంది, ఒప్పంద సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా నరేంద్ర మోదీ 76వ జన్మదిన వేడుకలు



**శ్రీ కాళహస్తి(ప్రశ్న న్యూస్)** శ్రీకాళహస్తి బిజెపి కోలా ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో దేశ ప్రధాని నరేంద్ర మోడీ 76వ జన్మదినం సందర్భంగా శ్రీకాళహస్తి ఆలయంలో ఘనంగా పూజలు నిర్వహించడం జరిగింది. సరస్వతి ఆడిటోరియంలో ఆవరణలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి రక్తదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి స్వచ్ఛందంగా ప్రజలు పాల్గొని రక్త దానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి బిజెపి నాయకులు టిడిపి నాయకులు జనసేన నాయకులు బిజెపి గ్రామీణ పార్టీ నాయకులు మరియు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోలా ఆనంద్ మాట్లాడుతూ నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా పరిపాలనలో దేశ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. 2047 నాటికి భారత్‌ను ప్రపంచంలో అగ్రగామి దేశంగా నిలపాలనే సంకల్పంతో ఆయన పనిచేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికిఎటువంటి షరతులు లేకుండా గీత వృత్తి పింఛన్ మంజూరు చేయాలి

- ఎమ్మెల్యే లకు పింఛన్ విషయం లో లేని నిబంధనలు సామజిక పింఛన్ లకు ఎందుకు.?
- కల్లు గీత కార్మిక సంఘం ములుగు జిల్లా అధ్యక్షులు గుండెబోయిన రవి గౌడ్



**ములుగు(ప్రశ్న న్యూస్)** ములుగు జిల్లాలో కల్లుగీత వృత్తి పెన్షన్ కు దరఖాస్తు చేసుకున్నా వారందరికీ ఎటువంటి షరతులు లేకుండా ప్రతి గీత కార్మికునికి వృత్తి పింఛన్ మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ కి శిశుసంక్షేమ, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క కి విజ్ఞప్తి చేస్తున్నామని రవిగౌడ్ తెలిపారు. కల్లుగీత కార్మిక సంఘం ములుగు జిల్లా కమిటీ సమావేశం జిల్లా కేంద్రంలోని సిఐటియు ఆఫీసులో బుర్ర జనార్ధన్ గౌడ్ అధ్యక్ష తన జరిగింది . ఈ సమావేశాన్ని ముఖ్య అతిథిగా హాజరైన రవిగౌడ్ మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి వృత్తి పింఛన్ మంజూరు చేయాలని అన్నారు. చిన్న చిన్న కారణాలతో పెన్షన్ రద్దు చేయడం సరి అయింది కాదని అన్నారు. ప్రజలు ఓట్లు వేసి గెలిపించిన నాయకులకు ఒకసారి ఎమ్మెల్యే అయిన రెండుసార్లు ఎమ్మెల్యే అయినా అన్నిసార్లుపింఛన్ వస్తుంటే చేయుత పింఛన్లకు అన్ని అడ్డంకులు ఎందుకని అన్నారు. ఎటువంటి షరతులు లేకుండా దరఖాస్తు చేసుకున్న అన్ని రకాల పెన్షన్లకు మంజూరు చేయాలని ఈ సందర్భంగా వారు కోరడం జరిగింది. దరఖాస్తు తేదీలను లాస్ట్ తేదీని ప్రకటించకుండా నిరంతరంగా పెన్షన్ల ప్రక్రియ ఉండాలని వారి సందర్భంగా కోరారు. పింఛన్ అనేది సామజిక భద్రత అని అన్నారు. ఈ కార్యక్రమంలోజిల్లా గౌరవ అధ్యక్షులు పులి నర్సయ్య గౌడ్ జిల్లా కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ గౌడ్. పులి రమేష్ గౌడ్ మునిగాల సురేష్ గౌడ్ కునూర్ సాగర్ గౌడ్. ఉయ్యాల మధుకర్ గౌడ్‌శోభన్ గౌడ్ మండ రాజు గౌడ్. రత్నాకర్ గౌడ్. పైడిమల్ల భరత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇప్పలపల్లిలో ఘనంగా ప్రజా పాలనా దినోత్సవం



**కాల్వ శ్రీరాంపూర్:** తెలంగాణ ప్రజా పాలనా దినోత్సవాన్ని పురస్కరించుకుని పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలం ఇప్పలపల్లి గ్రామపంచాయతీ ఆవరణలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ జిన్న రాంచంద్రారెడ్డి జాతీయ జెండాను



ఆవిష్కరించారు. అనంతరం జెండాకు వందనం చేసి ప్రజా పాలనా దినోత్సవం ప్రాధాన్యతను వివరించారు. గ్రామ అభివృద్ధి, ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవలు, గ్రామపంచాయతీ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలపై ఈ సందర్భంగా చర్చించారు. ప్రజల భాగస్వామ్యంతో గ్రామాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ జిల్లాల సంధ్య వేణు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది, గ్రామ పెద్దలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జెండా ఆవిష్కరణ అనంతరం పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుని కార్యక్రమాన్ని ముగించారు.

# సింహ వాహనసేవలో కళా వైభవం

**- 8 రాష్ట్రాల నుంచి 19 కళాబృందాలు.. 494 మంది కళాకారుల సందడి**





**తిరుమల(ప్రశ్న న్యూస్)** శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం నిర్వహించిన సింహ వాహనసేవ భక్తిభావంతో పాటు కళా వైభవాన్ని చాటింది. దేశంలోని ఎనిమిది రాష్ట్రాలకు చెందిన కళాకారులు తమ సంప్రదాయ, జానపద కళారూపాలతో భక్తులను అలరించారు. టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో 19 కళాబృందాలకు చెందిన 494 మంది కళాకారులు పాల్గొన్నారు.

### శాస్త్రీయ.. జానపద కళల సమ్మేళనం

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల కళాబృందాలు తమ ప్రత్యేక ప్రదర్శనలతో ఆకట్టుకున్నాయి. శ్రీ వేంకటేశ్వర సంగీత నృత్య కళాశాల కళాకారులు దశావతారాలు, భరతనాట్యం, కథక్, కూచిపూడి వంటి శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించారు.హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో గౌరసూర్ బోద్/చౌ, జానపద నృత్యాలు, డ్రమ్స్, కోలాటం తదితర సంప్రదాయ కళారూపాలు ప్రదర్శించారు. అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో చౌలియా, మేవశిరాస్, జానపద నృత్యం, గోందల్ నృత్యం కనువిందు చేశాయి.దాస సాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో తాళాలతో జానపద నృత్యం, డ్రమ్స్, నవదుర్గలు, శ్రీరామ చరితం, కోలాటం తదితర కళారూపాలను కళాకారులు ప్రదర్శించారు.

### భక్తి.. కళ.. భారతీయ సంస్కృతి

సింహ వాహనసేవ సందర్భంగా వివిధ రాష్ట్రాల కళాకారుల ప్రదర్శనలు తిరుమలలో భక్తి, కళ, భారతీయ సంస్కృతుల సమ్మేళనాన్ని ఆవిష్కరించాయి. శ్రీవారి వాహనసేవను వీక్షిస్తున్న భక్తులకు ఈ కళా ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.బ్రహ్మోత్సవాల సందర్భంగా దేశంలోని వివిధ ప్రాంతాల సంప్రదాయ, జానపద కళారూపాలకు టీటీడీ వేదిక కల్పిస్తోంది. ఆధ్యాత్మిక అనుభూతితో పాటు భారతీయ కళా వైవిధ్యాన్ని భక్తులకు పరిచయం చేసేలా ఈ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తోంది.

# కమీషన్ ఏజెంట్లకు రోగులు చెల్లించే ఫీజులో భారీ వాటా

- ఆరోపణలపై స్పందించిన జగిత్యాల జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి
- నిబంధనలు, నైతిక ప్రమాణాలపై అవగాహన కల్పిస్తున్నాం: డీఎంహెచ్ఓ డా. సుజాత
- నిబంధనలు ఉల్లంఘిస్తే తగిన చర్యలు తప్పవు



**జగిత్యాల(ప్రశ్న న్యూస్)** జగిత్యాల జిల్లాలో వైద్య సేవలకు సంబంధించి రోగులను ఆసుపత్రులకు తరలించే ఏజెంట్లకు కమీషన్లు చెల్లిస్తున్నారనే ఆరోపణలపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు దృష్టి సారించారు. జగిత్యాల జిల్లాలో వైద్య సేవల పేరుతో కమీషన్ల దందా సాగుతోందన్న ఆరోపణలపై ప్రజా ప్రశ్నలో ప్రచురితమైన “రోగిని తీసుకొస్తే నీకింత.. నాకింత” శీర్షికపై స్పందించిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. సుజాత, వైద్య రంగంలో నిబంధనలు, నైతిక ప్రమాణాలు పాటించేలా జిల్లా వైద్యులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.జిల్లాలో రోగులను ఆసుపత్రులు, వైద్యుల వద్దకు తీసుకువచ్చే కమీషన్ ఏజెంట్లకు రోగులు చెల్లించే ఫీజులో భారీగా వాటా ఇస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు మధ్యవర్తులకు 30 నుంచి 50 శాతం వరకు కమీషన్లు చెల్లిస్తున్నారనే ఆరోపణలు ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నాయి.ఈ కమీషన్ వ్యవహారం నిజమైతే. చివరకు ఆ భారాన్ని రోగులే భరించాల్సి వస్తుందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వైద్య సేవలు అందించే క్రమంలో రోగి ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన సమయంలో కమీషన్ వ్యవస్థకు తావు ఉండటం ఎంతవరకు సమంజసమనే చర్చ కూడా జరుగుతోంది.

### జంబిగద్దె ప్రాంతంలోని వైద్యుడి తీరుపై ఆరోపణలు

జగిత్యాల జిల్లాలోని జంబిగద్దె ప్రాంతానికి చెందిన ఓ ఎముకల వైద్యుడి వ్యవహారశైలిపై ప్రజలు, ప్రజా సంఘాలు పలు ప్రశ్నలు సంధిస్తున్నాయి. కమీషన్ ఏజెంట్లతో సమావేశాలు, సన్మానాలు, సరదా కార్యక్రమాలు, సంబరాలు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఇటీవల జిల్లాలో కొంతమంది వ్యక్తులు రోగులను ఒక ఆసుపత్రి నుంచి మరో ఆసుపత్రికి తరలించడం, వైద్య పరీక్షలు లేదా చికిత్సల కోసం నిర్దిష్ట ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ కేంద్రాలకు పంపించడం వంటి వ్యవహారాల్లో కమీషన్ల ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది. రోగి ప్రయోజనాలే ప్రధానంగా ఉండేలా వైద్య సేవలు అందించాల్సిన అవసరం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

### వైద్యులతో ప్రత్యేకంగా చర్చలు

ఏజెంట్ల కమీషన్లకు సంబంధించిన ఆరోపణలపై జిల్లా వైద్యులతో చర్చిస్తున్నామని డా. సుజాత తెలిపారు. వైద్య వృత్తిలో పారదర్శకత, నైతిక విలువలు, రోగి ప్రయోజనాలకు ప్రాధాన్యత వంటి అంశాలపై వైద్యులకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. వైద్య సేవలను వ్యాపార ప్రయోజనాల కంటే రోగి ఆరోగ్యం, అవసరాలకు అనుగుణంగా అందించాల్సిన బాధ్యత వైద్యులపై ఉందని, ఇందుకు సంబంధించి అమల్లో ఉన్న నిబంధనలను ప్రతి ఒక్కరూ తెలుసుకుని పాటించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

### క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం నిబంధనలపై అవగాహన

నేషనల్ మెడికల్ కమిషన్ కు సంబంధించిన నిబంధనలు, వైద్య వృత్తిలో పాటించాల్సిన నైతిక ప్రమాణాలు, వృత్తిపరమైన బాధ్యతలపై జిల్లా వైద్యులకు అవగాహన కల్పిస్తున్నామని డీఎంహెచ్ఓ వెల్లడించారు.అదేవిధంగా క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం పరిధిలో ఆసుపత్రులు, క్లినికల్ సంస్థలు పాటించాల్సిన నిబంధనల అమలుపై కూడా వైద్యులకు సూచనలు చేస్తున్నామని తెలిపారు. రోగులకు అందుతున్న వైద్య సేవల్లో నాణ్యత, పారదర్శకత, నిబంధనల అమలు వంటి అంశాలను అధికారులు పరిశీలిస్తున్నారని పేర్కొన్నారు.

### ఉల్లంఘనలకు చర్యలు తప్పవు

వైద్య రంగంలో అమల్లో ఉన్న నిబంధనలను ఉల్లంఘిస్తూ ఎవరైనా వ్యవహరిస్తే, నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని డా. సుజాత స్పష్టం చేశారు. ఆరోపణలు వచ్చిన ప్రతి అంశాన్ని నిబంధనల ప్రకారం పరిశీలించి, వాస్తవాలు వెలుగులోకి వస్తే సంబంధిత వారిపై చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని ఆమె పేర్కొన్నారు.

### రోగి ప్రయోజనాలే కేంద్రంగా వైద్యం

వైద్య సేవల విషయంలో రోగుల నమ్మకాన్ని కాపాడటం అత్యంత ముఖ్యమని, రోగి ఆరోగ్యం, అవసరాలు, వైద్యపరమైన ప్రయోజనాలే నిర్ణయాలకు ప్రాతిపదికగా ఉండాలని వైద్య శాఖ భావిస్తోంది. ఈ నేపథ్యంలో ఏజెంట్ల వ్యవస్థకు సంబంధించిన ఆరోపణలు, రిఫరల్స్, కమీషన్ల వ్యవహారాలపై వైద్య వర్గాల్లో అవగాహన పెంచడంతో పాటు నిబంధనల అమలుపై పర్యవేక్షణ కొనసాగించనున్నట్లు అధికారులు తెలిపారు.ఏజెంట్ల కమీషన్లపై వస్తున్న ఆరోపణలపై జిల్లా వైద్యులతో చర్చిస్తున్నాం. వైద్య రంగంలో నిబంధనలు, నైతిక ప్రమాణాలపై అవగాహన కల్పిస్తున్నాం. చీవీజ నిబంధనలు, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం అమలుపై కూడా వైద్యులకు అవగాహన కల్పిస్తున్నాం. నిబంధనలు ఉల్లంఘిస్తే తగిన చర్యలు తీసుకుంటాం అని జగిత్యాల డీఎంహెచ్ఓ డా. సుజాత తెలిపారు.

# మల్లారెడ్డి కోడలు ప్రీతి రెడ్డి ఫ్లెక్సీల చించివేత

- ప్రీతి రెడ్డి బర్త్ డే ఫ్లెక్సీలకు బీ ఆర్ ఎస్ కు ఎం సంబంధం.?
- ఇ ప్పుడు బీ ఆర్ ఎస్ లో ఇది చర్చనియంగా మారింది



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్)** మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత చామకూర మల్లారెడ్డి కోడలు డాక్టర్ ప్రీతి రెడ్డి జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు గురువారం రాజకీయ వివాదానికి దారితీశాయి. మేడ్చల్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను కొందరు బీఆర్ఎస్ కార్యకర్తలు చించివేయడంతో ఈ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది.

### ఫ్లెక్సీల్లో కీలక నేతల ఫొటోలు లేకపోవడంపై అభ్యంతరం

వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ప్రీతి రెడ్డి జన్మదిన ఫ్లెక్సీల్లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఫొటోలు లేకపోవడంపై కొందరు బీఆర్ఎస్ శ్రేణులు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు వార్తా కథనాలు వెల్లడించాయి. అదే సమయంలో మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డి తదితరుల చిత్రాలకు ప్రాధాన్యం ఇవ్వడంపై కూడా వారు ప్రశ్నలు లేవనెత్తినట్లు సమాచారం.

### ఐడీపీఎల్, సుచిత్ర ప్రాంతాల్లో ఘటన

ఐడీపీఎల్, సుచిత్రతో పాటు చింతల్, జీడిమెట్ల ప్రాంతాల్లో ప్రీతి రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కటౌట్లు, ఫ్లెక్సీల విషయంలో వివాదం చోటుచేసుకున్నట్లు తాజా కథనాలు పేర్కొంటున్నాయి. కొన్నిచోట్ల ఫ్లెక్సీలను బీఆర్ఎస్ శ్రేణులు చించివేసినట్లు సమాచారం.

### ప్రీతి రెడ్డి స్పందన

ఈ ఘటనపై ప్రీతి రెడ్డి స్పందిస్తూ, తన పుట్టినరోజు సందర్భంగా అభిమానులు, తన టీమ్, సిబ్బంది ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలకు రాజకీయాలతో సంబంధం లేదని పేర్కొన్నారు. రాజకీయ కార్యక్రమం అయితే పార్టీ ప్రోటోకాల్‌ను పాటిస్తామని ఆమె స్పష్టం చేశారు. ఫ్లెక్సీలను చించివేయగలరేమో కానీ తనలోని మనోబలాన్ని దెబ్బతీయలేరని వ్యాఖ్యానించారు. ఫ్లెక్సీలు చించిన వారిపై ఫిర్యాదు చేసే విషయాన్ని తాను పట్టించుకోవడం లేదని కూడా ఆమె చెప్పినట్లు దిశ కథనం పేర్కొంది.

### కార్యకర్తల వాదనకు.. అభిమానుల సమాధానం

మరోవైపు కొందరు బీఆర్ఎస్ కార్యకర్తలు పార్టీ ముఖ్య నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులకు ఫ్లెక్సీల్లో స్థానం కల్పించకపోవడాన్ని పార్టీ పరంగా అభ్యంతరకరంగా పేర్కొంటున్నారు. అయితే ప్రీతి రెడ్డి అభిమానులు మాత్రం ఇవి పార్టీ కార్యక్రమాల కోసం కాకుండా వ్యక్తిగత జన్మదిన శుభాకాంక్షల కోసం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలని, వాటిని రాజకీయ వివాదంగా చూడాల్సిన అవసరం లేదని వాదిస్తున్నారు.

### అసలు వివాదం ఎక్కడ.?

పుట్టినరోజు శుభాకాంక్షల ఫ్లెక్సీలతో ప్రారంభమైన ఈ ఘటన ఇప్పుడు బీఆర్ఎస్‌లోని స్థానిక రాజకీయ సమీకరణలు, పార్టీ నాయకత్వం--స్థానిక నేతల మధ్య సమన్వయం వంటి అంశాలపై చర్చకు దారితీసింది.

# బొజ్జ గణపయ్యకు ఘనమైన పూజలు





నారాయణగూడ(ప్రశ్న న్యూస్) వినాయక నవరాత్రుల్లో భాగంగా నారాయణగూడ లోని ఆశిష్ ఆర్చిడ్ అపార్ట్మెంట్ లో రంగురంగుల విద్యుత్ దీపాలతో అత్యంత ఆకర్షణీయంగా అలంకరించిన మండపంలో ప్రతిష్టించిన వినాయక విగ్రహానికి భారీ పూలమాలతో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కాబ్రా, కర్ణావట్ కుటుంబ సభ్యులు పాల్గొని స్వామి వారికి అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం నిర్వహిస్తున్న ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు భోజన సౌకర్యం కల్పించడం ఆనందంగా ఉందని నిర్వాహకులు తెలిపారు. .

# భక్తులతో ఈవో ముచ్చట

**సౌకర్యాలపై ఆరా.. సంతృప్తి వ్యక్తం చేసిన భక్తులు**



**తిరుమల(ప్రశ్న న్యూస్)** శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజైన గురువారం ఉదయం నిర్వహించిన సింహ వాహనసేవను వీక్షించేందుకు వచ్చిన భక్తులతో టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర ముచ్చటించారు. భక్తుల గ్యాలరీలోకి వెళ్లి వారికి అందుతున్న సౌకర్యాలు, దర్శన ఏర్పాట్లపై స్వయంగా ఆరా తీశారు.తమిళనాడు, హైదరాబాద్, నెల్లూరు, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఈవో ఆత్మీయంగా మాట్లాడారు. వసతి, దర్శన ఏర్పాట్లు, వాహనసేవను వీక్షించే సదుపాయాలు, ఇతర మౌలిక వసతులపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. టీటీడీ కల్పిస్తున్న సౌకర్యాలపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు.

### సేవకులకు ఈవో సూచనలు..

అనంతరం శ్రీవారి సేవకులతో ఈవో మాట్లాడుతూ.. బ్రహ్మోత్సవాలకు వచ్చే ప్రతి భక్తుడికి మరింత మెరుగైన, సౌకర్యవంతమైన సేవలు అందించాలని సూచించారు. భక్తులతో ఆత్మీయంగా వ్యవహరిస్తూ, శ్రీవారి దర్శన అనుభూతిని మరింత ఆనందదాయకంగా తీర్చిదిద్దాలని అన్నారు.టీటీడీ అందిస్తున్న వివిధ సేవలు, సౌకర్యాలను ఎప్పటికప్పుడు భక్తులకు చేరవేయడంతో పాటు వారి అవసరాలకు అనుగుణంగా స్పందించాలని సేవకులకు సూచించారు.భక్తి.. సేవ.. ఆతిథ్యంతో శ్రీవారి బ్రహ్మోత్సవాలకు విచ్చేసే ప్రతి భక్తుడికి ఆధ్యాత్మిక ఆనందాన్ని అందించడమే టీటీడీ లక్ష్యమని ఈవో తెలిపారు.

# సింహ వాహనంపై యోగ నరసింహుడు


**- ధైర్యం.. పరాక్రమానికి ప్రతిరూపంగా మలయప్పస్వామి దర్శనం**



**తిరుమల(ప్రశ్న న్యూస్)** శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో మూడో రోజైన గురువారం ఉదయం శ్రీ మలయప్పస్వామివారు యోగ నరసింహుని అలంకారంలో సింహ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. సింహ వాహనంపై కొలువుదీరిన స్వామివారి దివ్య మంగళరూపాన్ని దర్శించేందుకు పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు.గజరాజులు ముందుగా ఠీవిగా నడుస్తుండగా భక్త బృందాల భజనలు, కోలాటాలు, జీయ్యంగార్ల ఘోష, మంగళవాయిద్యాల నడుమ సింహ వాహనసేవ అత్యంత వైభవంగా సాగింది.ధైర్యానికి ప్రతీకదుష్టశిక్షణ, శిష్టరక్షణకు ప్రతీకగా శ్రీ మలయప్పస్వామివారు సింహ వాహనాన్ని అధిరోహిస్తారని ఆధ్యాత్మిక విశ్వాసం. సింహం పరాక్రమం, ధైర్యం, తేజస్సు, ఆధిపత్యం, మహాశక్తికి ప్రతీకగా భావిస్తారు. సింహరూప దర్శనం భక్తుల్లో ధైర్యం, ఆత్మవిశ్వాసం, పట్టుదల, విజయస్ఫూర్తిని మేల్కొలుపుతుందని విశ్వసిస్తారు.అభయమిచ్చిన యోగ నరసింహుడుయోగ నరసింహుని అలంకారంలో సింహ వాహనంపై శ్రీ మలయప్పస్వామివారి దర్శనం భక్తులకు ప్రత్యేక ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించింది. ధైర్యంగా, కర్తవ్యనిష్ఠతో ముందుకు సాగాలనే స్ఫూర్తిని ఈ సేవ అందించింది.వాహనసేవలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామి, టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి, సీవీఎస్వో కే.వి. మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# రైస్ మిల్లర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

- సిద్దిపేటలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ
- ఆర్డీవోకు మెమోరాండం అందజేత



**గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )** రైస్ మిల్లర్ల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ సిద్దిపేట జిల్లా కేంద్రంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీవోకు మెమోరాండం అందజేశారు.ఈ సందర్భంగా గజ్వేల్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.బి. ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు రైస్ మిల్లర్ల సమస్యల పరిష్కారం కోసం నిరసన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. రైస్ మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు.ప్రభుత్వం తక్షణమే స్పందించి రైస్ మిల్లర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందని తెలిపారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు, పలువురు రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాధనం కాపాడాల్సిన బాధ్యత

# తెలంగాణ ఇంటర్ విద్య అధికారులకు లేదా.?

- ఇంటర్ విద్యలో నకిలీల తొలగింపునకు సంవత్సరాల తరబడి సాగదీత
- అధికారులకు ఫిర్యాదు చేసినా...నత్తలు నవ్వినా.. ఇంటర్ విద్య అధికారుల చర్యలు శున్యం.?
- యూనివర్సిటీలు పుట్టకముందే చదివామని నకిలీలు గెజిటెడ్ ఆఫీసర్లుగా అవతారమెత్తిన వైనం.?
- 36 మంది నకిలీ అధ్యాపకులకు షోకాస్ నోటీసులు ఇచ్చిన టెర్మినేషన్ చేయకుండా కాలయాపన.?
- 11 మంది నకిలీ అధ్యాపకులపై ఫిర్యాదులు ఉన్నా చర్యలు శూన్యం.?

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ ఇంటర్ విద్యా వ్యవస్థలో బీఆర్ఎస్ ప్రభుత్వం 2023 మే 3న చేపట్టిన ఒప్పంద అధ్యాపకుల క్రమబద్ధీకరణ నకిలీలకు జాక్ పాట్ లా తగిలింది. 36 మంది కలర్ జిరాక్స్ లతో ఇంటర్ విద్యలో క్రమబద్ధీకరణ పొందారని సుమారు రెండు నెలల క్రితం అధికారులు షోకాజ్ నోటీసులు ఇచ్చినా ఇంతవరకు వారిని టెర్మినేషన్ చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. ప్రభుత్వం జీతాల రూపంలో చెల్లిస్తున్న ప్రజాధనాన్ని నకిలీల పాలు కాకుండా కాపాడాల్సిన బాధ్యత తెలంగాణ ఇంటర్ విద్య అధికారులకు లేదా అనే సందేహాలు తలెత్తుతున్నాయి.ఉన్నతాధికారుల ఆదేశాలు లేవంటూ వీరికి ప్రతినెల జీతాల రూపంలో ఇంక్రిమెంట్ల రూపంలో ప్రజాధనాన్ని దోచిపెడుతూనే ఉన్నారు. వీరు నకిలీ మేము సమర్పించారని యూనివర్సిటీలు పెట్టకముందే చదివామని ఫ్యాబ్రికేటెడ్ డాక్యుమెంట్స్ సమర్పించి ఉద్యోగం క్రమబద్ధీకరణ చేయించుకున్నారని వీరిపై సాక్షాత్తు ప్రిన్సిపాల్లే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదు. అధికారుల తీరు చూసి నత్తలు నవ్వినా తమకేమీ సంబంధం లేనట్టుగా తెలంగాణ ఇంటర్ విద్యాధికారులు వ్యవహరిస్తున్నారు. ప్రిన్సిపాల్ లు ఉన్నతాధికారుల అండదండలతో కలర్ జిరాక్సు నకిలీ మేమోలతో ఇంటర్ విద్యలో ప్రవేశించిన ఈ ఫేక్ రాజాలు నేడు గెజిటెడ్ ఆఫీసర్లుగా సమాజంలో అవతారం ఎత్తారు. ఒక్క నల్గొండ జిల్లాలోని సుమారు పదుల సంఖ్యలో నకిలీ మెమొలు కలిగిన జూనియర్ ఒప్పంద అధ్యాపకులు క్రమబద్ధీకరణ పొందారని వారిని విధుల నుంచి తొలగించాలని ఉస్మానియా నిరుద్యోగులు వివిధ సంఘాలు ఉన్నతాధికారులకు గతంలోనే ఫిర్యాదులు చేశారు.

### 11 మంది నకిలీ అధ్యాపకులపై చర్యలకు ఉత్తుత్తి ఆదేశాలు

యాదాద్రి భువనగిరి నల్గొండ సూర్యాపేట ఉమ్మడి వరంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు సంబంధించిన నకిలీ జూనియర్ అధ్యాపకులపై చర్యలు తీసుకోవడానికి జూన్ 4 2024న ఉన్నతాధికారులు ఉత్తుత్తి ఆదేశాలు జారీ చేశారు. వీరిలో కొందరు యూనివర్సిటీలు పుట్టకముందే పీజీలు చేశామని కలర్ జిరాక్సు సమర్పించి క్రమబద్ధీకరణ పొందారు. ఇంకొందరు కలర్ జిరాక్సులను రెగ్యులరైజేషన్ సమయంలో మార్పిడి చేసి,చెల్లుబాటు గాని యూనివర్సిటీల మెమోలను సమర్పించారు అనే ఆరోపణలు ఉన్నాయి. ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన ఏ సీనయ్య ఎమ్మెస్సీ కెమిస్ట్రీ భోధించే అధ్యాపకుడు 2004- 05 వ సంవత్సరంలో తాను కళింగ యూనివర్సిటీ నుండి పీజీ పూర్తి చేశానని అధికారుల కన్నులు కప్పి కలర్ జిరాక్స్ మెమోలను సమర్పించాడు. వాస్తవానికి కలింగా యూనివర్సిటీ 2013లో యూజీసీ గుర్తింపు పొంది మునగడలోకి వచ్చింది. యూనివర్సిటీ పుట్టకముందే మనవాడు పీజీ చేశాడని తెలంగాణ ఇంటర్ విద్య అధికారుల చెవిలో పువ్వులు పెట్టినా గత రెండు దశాబ్దాలకు పైగా అధికారులు చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. సాక్షాత్తు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఇట్టి విషయంలో పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించినా అధికారులు చర్యలు తీసుకోకుండా కాలయాపన చేయడం నిజంగా ప్రజాధనాన్ని లూటీ చేయడమే అనిపిస్తుంది. నార్త్ నల్గొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల విజయపురి కళాశాలకు చెందిన మహమ్మద్ రజవల్లి ఖాన్ రాజస్థాన్ విద్యాపీఠం నుండి ఎంఎస్సీ మ్యాస్ నకిలీ ధ్రువపత్రాలను అధికారులకు సమర్పించి క్రమబద్ధీకరణ పొందాడు అనే ఆరోపణలు ఉన్నాయి ఈ అధ్యాపకుడి విషయంలో చర్యలు తీసుకోవాలని ఆ కళాశాల ప్రిన్సిపాల్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి ఉన్నతాధికారులకు సమాచారం అందించిన అధికారులు స్పందించకపోవడం ప్రజాధనం పట్ల తెలంగాణ ఇంటర్ విద్య అధికారులకు ఉన్న బాధ్యతను ఇక్కడ సమాజంలోని ప్రతి నిరుద్యోగి పౌరుడు ఎండగట్టాల్సిందే. యాదాద్రి భువనగిరి జిల్లాలోని రామన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హిందీ అధ్యాపకురాలిగా విధులు నిర్వర్తిస్తున్న శ్రీమతి కౌసర్ బేగం మెమోలు కూడా నకిలీవంటూ హిందీ సాహితీ సమ్మేళనం అలహాబాద్ వారి మెమోలు చెల్లవంటూ




నిరుద్యోగులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. హిందీ సాహితీ సమ్మేళనం అనేది ఏ ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూషన్ కాదని యూనివర్సిటీ కాదని ప్రమోషన్లకు కూడా ఈ మెమొలు పనికిరానివని గతంలో సుప్రీంకోర్టు జడ్జిమెంట్లు కూడా ఉన్నాయి.అయినా అధికారులు ఉత్తుత్తి చర్యలు తీసుకునేందుకు హడావుడి చేసి గత మూడు సంవత్సరాలుగా వీళ్లకు గ్రీన్ పెన్ అందించి గెజిటెడ్ ఉద్యోగం కట్టబెట్టి దర్జాగా ప్రజాధనాన్ని దోచిపెడుతున్నారు ఈ 11 మంది నకిలీ అధ్యాపకులపై చర్యలు తీసుకోవాలని ఓయి నిరుద్యోగ జేఏసీ నాయకులు శంకర్ గతంలోనే సిబిసిఐడి మరియు విజిలెన్స్లలో ఫిర్యాదులు చేసి కోర్టులను సైతం ఆశ్రయించి రిట్ పిటిషన్లు దాఖలు చేశారు.

# విధులకు గైర్హాజరు.. రిజిస్టర్‌లో హాజరు

- మమ్మల్ని అడిగే వాడు ఎవ్వడు లేడు.?
- ఇష్టా రీతిగా వ్యవహరిస్తున్న సూపర్ వైజర్లు
- పట్టించుకొని మెడికల్ ఆఫీసర్




**ఉప్పల్(ప్రశ్న న్యూస్)** ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అంటే ఒకప్పుడు జిల్లాలోనే ప్రత్యేక గుర్తింపు ప్రస్తుతం పరిస్థితి వేరుగా మారింది ఇప్పుడు నిత్యం ఏదో ఒక వార్తల్లో నిలుస్తుంది. ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోజు రోజు రోజుకు అవినీతి తాండవం చేస్తుందనీ గతంలో పలు పత్రికల్లో కథనాలు వెలువడ్డ సిబ్బంది మాత్రం మాకేంటి సంబంధం అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని రోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హాస్పిటల్ సిబ్బంది విధులకు గైర్హాజరు అయినా వారు వచ్చి అటెండెన్స్ ను వేసుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పుడు అదే నిజమయ్యింది. ఈ ఆరోపణలు గతంలో కూడా ఉన్నా సదరు మెడికల్ ఆఫీసర్ చూసి చూడనట్లు వదిలేయడం వెనక ఆయన హస్తం ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారి లోనే ఈ తతంగం జరుగుతుందన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దేనికి సంకేతం అని పలువురూ ఆస్పత్రి సిబ్బంది బయటికి చెప్పలేక సతమతమవుతున్నారు. అసలు సూపర్ వైసర్ లను ప్రతీ విషయంలో వెనకేసుకు రావడంలో అంతర్యం ఏమిటి . విధుల పట్ల నిర్లక్ష్యమా లేకా అడిగే వాడు ఎవ్వరూ లేరనే ధీమానా ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గతంలో డబ్బులు వసూళ్ల ఆరోపణలు మెడికల్ ఆఫీసర్ సంతకం దేని మీద కావాలన్నా డబ్బులు ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడిందనీ, ఎవరైనా డెలివరీకి వచ్చినా సిబ్బంది చేతి తడపనిదే పని కాదని గతంలో కూడా అనేక ఆరోపణలు. చివరకు ఆశ కార్యకర్తలు లేదా ఆరోగ్య కార్యకర్తలు కూడా ఎవరికన్నా మెడికల్ ఆఫీసర్ సంతకం కావాలన్న డబ్బులు అడుగుతున్నారనీ. గతంలో ఆశల వద్దా డబ్బులు ముక్కు పిండి వసులు చేసినట్లు పలుసార్లు ఆరోపణలు ఉన్నాయి. మరి మెడికల్ ఆఫీసర్ కి సూపర్ వైజర్లకు ఇందులో ఎవరి వాట ఎంత.? సూపర్ వైజర్లకు ఆశలు అన్న, ఎ ఎన్ ఎంలు అన్నా చాలా చిన్న చూపు అనీ కనీస గౌరవం లేకుండా మాట్లాడడం వెనక అంతర్యం ఏమిటో.? ముందు నుయ్యి వెనక గొయ్యి అన్న చందంగా మెడికల్ ఆఫీసర్ ను వెళ్ళి అడగాలంటే విధుల్లో ఎక్కడ ఇబ్బంది పెడతారో అని సిబ్బంది భయపడుతున్నారు అని సమాచారం. హాస్పిటల్ కి మందుల కోసం వచ్చిన పేషెంట్ల దగ్గర దురుసుగా ప్రవర్తించడం వ్యక్తి గతంగా ఆశలను వేదించడం, ఏ ఎన్ ఎం లను విధులలో టార్గెట్ కాలేదని, చెప్పిన మాట వినలేదని కక్షపూరితంగా వేధించడం వారు చెప్పిన మాట వినని వారికి అవసరం లేకున్న డ్యూటీ వేయడం వంటి మానసిక ఇబ్బందులకు గురిచేయడం జరిగిందని గతంలో అనేక ఆరోపణలు మెడికల్ ఆఫీసర్ సూపర్ వైజర్ల ల పైన ఉన్నాయి. ప్రభుత్వ ఆసుపత్రిలో అందిన కాడికి దండుకోవడం ఎంటి అని వచ్చిన రోగులు తమ బాధలను అనేకసార్లు మీడియా మిత్రులు తెలియజేశారు. అసలు సూపర్వైజర్ మెడికల్ ఆఫీసర్ గా చెలామణి అవుతున్నారా.? అనే సందిగ్ధం కూడా ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నెలకొంది. ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అసలు మెడికల్ ఆఫీసర్ ఉన్నారా లేక సూపర్ వైజర్ల ఇష్ట రాజ్యం నడుస్తుందా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి వచ్చిన రోగుల ముందే ఇష్టారీతిగా అసభ్య పదజాలంతో మాట్లాడడం ఏంటో అర్థం కాని పరిస్థితి, ఆసుపత్రిలో సూపర్ వైజర్లకు, మెడికల్ ఆఫీసర్ వర్క్ చేయండనీ చెప్పాలి. అలాగే విధులు నిర్వహించే సిబ్బందిని ఎక్కడైన ఒకే రకంగా చూడాలీ కానీ ఉప్పల్ హాస్పిటల్ లో మాత్రం పూర్తిగా విరుద్ధమని చెప్పాలి సదరు సూపర్ వైజర్లు అటెండెన్స్ వేసుకుంటే మెడికల్ ఆఫీసర్ ఎం చేస్తున్నట్లు. కింది స్థాయి సిబ్బంది విధులు ఎలా నిర్వర్తిస్తున్నారో ఆ మాత్రం చేసుకోలేదా. అసలు ఒక్క రోజు విధులకు హాజరు కాకపోతే మధ్యానం లోపే చూసి రానివారికి ఆబ్సెంట్, లేదా సీ ఎల్ వెయ్యాలి, సిబ్బంది విధులకు హాజరు కాకున్నా ఎందుకు అవకాశం ఇచ్చినట్లో సదరు మెడికల్ ఆఫీసర్ కే తెలియాలి ఇదంతా చూస్తే ఇందులో మెడికల్ ఆఫీసర్ పాత్ర కూడా కీలకంగానే కనిపించడం గమనించదగ్గ విషయం.ప్రభుత్వ ఉద్యోగి విధులకు రాకుండా జీతం తీసుకోవడం ఎంత వరకు సమంజసం దీని వల్ల ప్రభుత్వానికి భారీగా గండి పడే అవకాశం ఉంది .ఇలా తెలిసింది కొంతవరకే తెలియకుండా విధులకు హాజరు కాకుండా ఎంత మంది తమ విధులను దుర్వినియోగం చేశారో. విధులకు హాజరు కాకుండా వచ్చినట్లు అటెండెన్స్ వేసుకొని ఎంత మంది తిన్నారో.?ఇప్పుడు తెలిసింది కొంత మంది మాత్రమే. విధులకు హాజరు కాకున్నా కొన్ని నెలలుగా ఎంత మంది జీతం తీసుకున్నారో అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.గత కొన్ని నెలలుగా ఇదే తతంగం జరుగుతున్ననాకేమి సంబంధం లేదన్నట్లు గా చూసి చూడనట్లు వదిలేయడం వెనుక అంతర్యం ఏమిటి.అసలు వారి వద్ద నుండి ఎంత డబ్బులు కలెక్ట్ చేస్తున్నారు అనే అనుమానాలు, ఆరోపణలు సైతం వస్తున్నాయి వడ్డించే వాడు మనవాడైతే మనం ఎక్కడున్నా మనకు ఇబ్బంది లేదు అన్నట్లుగా ఉంది వ్యవహారం ఆశ కార్యకర్త, ఏ ఎన్ ఎం డ్యూటీకి సరైన టైం లో రాకపోతే ఆబ్సెంట్ వేసే మెడికల్ ఆఫీసర్ మరి సూపర్ వైజర్లు విషయంలో ఎందుకు మరిచారో వారిని వెనకేసుకోవడానికి గల అంతర్యం ఏమిటో వారికే తెలియాలి. సదరు హాస్పిటల్ సిబ్బంది ఏ టైమ్ కి విధులకు వస్తారో కూడా తెలియదు ఉదయం 9 గంటలకు వచ్చి సాయంత్రం 4 గంటల దాకా విధులు నిర్వహించ వలసిన సిబ్బంది మధ్యాహం లోపే విధులు పూర్తి చేసుకుని ఇండ్లకు వెళు తున్నారనే ఆరోపణలు చాలా ఉన్నాయి, కొందరైతే 11 గంటలకు డ్యూటీ కి వచ్చి అటెండెన్స్ వేసుకున్నారని కొందరి సిబ్బంది ఆరోపణ. దీనిపై వివరణ అడగాలని ప్రయత్నించగా మమ్మల్ని ఎవ్వరు ఏమి చేయలేరు. రిపోర్టర్లు మమ్మల్ని ఏం చేస్తారు అనే ధోరణితో మాట్లాడతారని అక్కడి సిబ్బంది చెప్పడం చూస్తే ఎంత ధైర్యంగా సిబ్బంది తప్పులకు పాల్పడుతున్నారో అర్థం అవుతుంది. అడిగిన వారినీ భయభ్రాంతులకు గురి చేస్తూ మీరు ఉద్యోగం చేయాలని ఉందా లేక ఇంటికి వెళ్లాలని ఉందా అని బెదిరింపులకు పాల్పడుతున్నారని సదరు కింది స్థాయి సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పై విషయాలను అన్నింటినీ గమనించి ఉన్నతాధికారులు మెడికల్ ఆఫీసర్, నదరు సూపర్ వైజర్ పై సమగ్రమైన విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, సిబ్బందికి ప్రజలకు న్యాయం చేయాలని ఆస్పత్రి సిబ్బంది తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.

### వీర తెలంగాణ సాయుధ పోరాట

# వారసత్వాన్ని కాపాడుకోవాలి

**- ఎస్ఎఫ్ఐ జిల్లా సదస్సులో నాయకుల పిలుపు**




**మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )** తెలంగాణ ప్రాంత ప్రజలను నైజాం నవాబుల రజాకార్ల అరాచకాలు నుండి భూస్వాముల వెట్టి చాకిరి విముక్తి చేసిన ఘనత వీర తెలంగాణ సాయుధ పోరాటాన్ని ఆ పోరాట చరిత్రను, త్యాగాలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మాజీ నాయకులు బండారు రవికుమార్ పిలుపునిచ్చారు.ఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వీర తెలంగాణ సాయుధ పోరాటం పై జరిపిన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు తెలంగాణ నేలపై భూమి భుక్తి వెట్టిచాకిరి విముక్తి కోసం సాగిన సాయుధ పోరాటం ప్రపంచ చరిత్రలోనే అరుదైనదని కమ్యూనిస్టుల నాయకత్వంలో వేలాది మంది నైజాం నియంతృత్వాన్ని రజాకారుల అరాచకాలను తుదిముట్టించి పది లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన ఘనత కమ్యూనిస్టుల పోరాట ఫలితమేనని అన్నారు అయితే నేడు కొందరు రాజకీయ ప్రయోజనాల కోసం సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తూ మత రంగు పులిమెందుకు కుట్రలు చేస్తున్నారని భావితరాలకు నిజమైన తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను తెలియజేయవలసిన బాధ్యత విద్యార్థులు యువతపై ఉందని అన్నారు.ఆనాడు స్వాతంత్ర్య ఉద్యమంలో గానీ తెలంగాణ సాయుధ పోరాటంలో ఎలాంటి పాత్ర లేనటువంటి వాళ్లు ఈరోజు తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను తప్పుదారి పట్టిస్తున్నారని అన్నారు ఆనాడు జరిగింది ముమ్మాటికి విలీనం మాత్రమేనని స్వాతంత్రం వచ్చిన తర్వాత భారత సైన్యంలో హైదరాబాద్ సంస్థానన్ని విలీనం చేసింది కానీ ప్రజలకు ఎలాంటి విముక్తి జరగలేదన్నారు. ఆనాడు పల్లె పల్లెనా సంఘాలు పెట్టి ప్రజలను చైతన్యపరిచి నైజాం రజాకార్ల ను తరిమికొట్టిన చరిత్ర కమ్యూనిస్టుల నాయకత్వంలో జరిగిన పోరాటానిదేనని అన్నారు. భవిష్యత్తులో విద్యా,వైద్యం,వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత విద్యార్థులు యువత పైన ఉందని ఎస్ఎఫ్ఐ నాయకత్వంలో జరిగే పోరాటాలలో కలిసి రావాలని అన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు మాజీ జిల్లా కార్యదర్శి ఎం .నరేష్, ఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి కార్తీక్, జిల్లా అధ్యక్షులు అవినాష్, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షలు బాల కిరణ్, జిల్లా ఉపాధ్యక్షులు అరుణ్, శామ్, జిల్లా కమిటీ సభ్యులు సాయి, జిల్లా నాయకులు వినయ్, ప్రేమ్, జి ఎం పి ఎస్ జిల్లా కార్యదర్శి కొమురయ్య, సీఐటీయూ మేడ్చల్ మండల నాయకులు నర్సింగ్ రావ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలు



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో జాతీయ పతాకాన్ని ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు ఆవిష్కరించారు.మేడ్చల్ మల్కాజిగిరి తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించిన ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు.మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లో గురువారం తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. ఈ వేడుకలకు జిల్లా యంత్రాంగం విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేసింది. ముఖ్య అతిథిగా ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు విచ్చేసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అంతకు ముందు తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నివాళ్లు అర్పించి, పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించారు. జిల్లా కలెక్టర్ మను చౌదరి, ఉప్పల్ డిసిపి సురేష్ కుమార్, అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, విజయేందర్ రెడ్డి లు కలిసి ప్రజాపాలన దినోత్సవ శు భాకాంక్షలు తెలియజేశారు. జిల్లా ప్రగతిని, సెప్టెంబర్ 17 ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రజలనుద్దేశించి ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు ప్రసంగించారు. ఈ వేడుకల్లో జిల్లా మార్కెటింగ్ కమిటి ఛైర్మన్ నర్సింహులుయాదవ్, గ్రాంధాలయ కమిటి ఛైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్టిఎ కమిటి సభ్యులు జైపాల్ రెడ్డి, డిఆర్ఓ మాలతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### జగిత్యాల జిల్లాలో ఘనంగా

# ప్రజాపాలన దినోత్సవ వేడుకలు

**- హాజరైన మైనారిటీ వెల్ఫేర్ పబ్లిక్ ఎంటర్ప్రైజెస్ శాఖ మంత్రి అజాహారుద్దీన్**



**జగిత్యాల(ప్రశ్న న్యూస్)** జగిత్యాల జిల్లా కలెక్టరేట్ లో ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా మైనారిటీ వెల్ఫేర్ మరియు పబ్లిక్ ఎంటర్ప్రైజెస్ శాఖ మంత్రి అజాహారుద్దీన్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమానికి జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ సంగనభట్ల దినేష్, జిల్లా అదనపు కలెక్టర్లు బి.ఎస్ లత, బి. రాజ గౌడ్, జిల్లా రెవెన్యూ అధికారి కె.వై ప్రసాద్, జగిత్యాల ఆర్డీవో మధు సూదన్ పాల్గొన్నారు.ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా జగిత్యాల జిల్లా పరిషత్ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన జగిత్యాల జిల్లా పరిషత్ ప్రత్యేక అధికారి, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా జగిత్యాల రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో జాతీయ పతాకావిష్కరణ చేశారు.

## ఓటీటీకి తమిళ రొమాంటిక్ మూవీ!




వెండితెరపై 'శోభనం' నేపథ్యంలోని కథలకు .. కంటెంట్ కి ఎంతో ప్రత్యేకత ఉంది. ఈ తరహా కథలకు కామెడీ తోడైతే, ఆ సినిమాలు ఏ స్థాయిలో విజయాల దిశగా దూసుకుపోతాయనే సంగతి తెలిసిందే. అలాంటి ఒక నేపథ్యం చుట్టూ అల్లుకున్న కథతో, చాలాకాలం తరువాత ప్రేక్షకుల ముందుకు ఒక సినిమా వచ్చింది. ఆ సినిమాపేరే 'మొద రాత్రి'. రిషికాంత్ – అనిష్మా అనిల్ కుమార్ ప్రధానమైన పాత్రలను పోషించిన సినిమా ఇది. తమిళంలో చిన్న సినిమాలకు పెద్దవిజయాలను సాధించి పెట్టిన ఆర్టిస్టులలో రిషి కాంత్ – అనిష్మా అనిల్ కుమార్ పేర్లు తప్పకుండా కనిపిస్తాయి. వీరిద్దరూ జోడీగా దర్శకుడు రాజా కరుప్పస్వామి 'మొద రాత్రి' అనే సినిమాను రూపొందించాడు. భరత్ శంకర్ దర్శకత్వం వహించిన ఈ సినిమా, ఆగస్టు 21వ తేదీన థియేటర్లకు వచ్చింది. పాజిటివ్ టాక్ తెచ్చుకున్న ఈ సినిమా, రేపు ( సెప్టెంబర్ 18)న 'నెట్ ఫ్లిక్స్' ఫ్లాట్ ఫామ్ పైకి రానుంది. అందుకు సంబంధించిన అధికారిక ప్రకటన వచ్చేసింది. అప్పటివరకూ ఏ మాత్రం పరిచయం లేని ఒక యువకుడు – యువతి, పెద్దలు కుదిర్చిన పెళ్లి చేసుకుంటారు. సంప్రదాయం ప్రకారం ఆ జంటకు శోభనాన్ని ఏర్పాటు చేస్తారు. అయితే ఆ ఇద్దరి జీవితాలలోని రహస్యాలు ఎలా బయటపడతాయి? అప్పుడు వాళ్లు ఏం చేస్తారు? అనేది కథ. రొమాంటిక్ కామెడీ టచ్ తో నడిచే సినిమా,తమిళంతో పాటు తెలుగు .. మలయాళ .. కన్నడ .. హిందీ భాషల్లో అందుబాటులోకి వస్తోంది. ఓటీటీ వైపు నుంచి ఈసినిమా ఏ స్థాయిలో ఆకట్టుకుంటుందో చూడాలి మరి.

# ఏడ్చిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి: ఉదయభాను



ఉదయభాను .. 30 ఏళ్ల క్రితమే యాంకర్ గా ఒక టీవీ షోలో గలగలమని మాట్లాడుతూ ఎంతో మంది హృదయాలను దోచుకున్నారు. ఆకర్షణీయమైన రూపంతో ఆకట్టుకునే ఉదయభానుకు అప్పట్లో ఎంతోమంది అభిమానులు ఉండేవారు. ఆ తరువాత ఒక వైపున ఈవెంట్స్ .. మరో వైపున సినిమాలు చేస్తూ ఆమె బిజీ అయ్యారు. రీసెంట్ గా 'పంచనామా' అనే వెబ్ సిరీస్ తో ఆమె నిర్మాతగా మారారు. అలాంటి ఉదయభాను తన గురించిన అనేక విషయాలను 'ఐ డ్రీమ్' వారికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రస్తావించారు. "నాకు నా ప్రొఫెషన్ అంటే చాలా ఇష్టం. అందువలన ఆ పనికి సంబంధించిన విషయాలను నేను సమస్యలుగా అనుకోను. నాకు సంబంధించిన వర్క్ విషయంలో నేను ఎప్పుడూ బద్ధకించలేదు .. ఎక్కడా ఆలస్యం చేయలేదు. కానీ నాకు డిసిప్లిన్ లేదనే పుకారు పుట్టించారు. అంతే కాదు ఒక ఈవెంట్ కి గానీ .. ఒక షోకి గాని నేను పెద్ద మొత్తంలో తీసుకుంటానని ప్రచారం చేస్తూ, అవకాశాలు నా వరకూ రాకుండా చేశారు. అలాంటివి విన్నప్పుడు నాకు చాలా బాధ కలుగుతుంది" అని అన్నారు. "నేను ఎప్పుడూ చాలా యాక్టివ్ గా ఉంటాను. కానీ నేను చాలా 'డల్' అయ్యాననే విషయాన్ని నలుగురికి తెలిసేలా చేయడానికి కొంతమంది ప్రయత్నించడం నా ముందే జరిగింది. ఇక్కడ ఎవరో మన గురించి ఒక మాట చెబితే నమ్మేస్తారే తప్ప, నేరుగా మనలను అడగరు .. అసలు విషయమేమిటనేది తెలుసుకోరు. కొన్ని షోస్ విషయంలో నన్ను పక్కన పెట్టినప్పుడు కార్లోనే కూర్చుని ఏడ్చిన సందర్భాలు చాలానే ఉన్నాయి. ఎవరెన్ని చేసినా నేను ఆగలేదు. ఎలాంటి సపోర్టు లేకుండా నిలబడగలిగినందుకు నాకు చాలా గర్వంగా ఉంది" అని అన్నారు.



# ప్రెగ్నెన్సీతోనే కెమెరా ముందుకు..

## సమంత కొత్త ప్రయాణం

మాతృత్వాన్ని ఆస్వాదించేందుకు సిద్ధమవుతున్న నటి సమంత.. మరోవైపు తన వృత్తిపరమైన ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు. తొలి బిడ్డ కోసం ఎదురుచూస్తున్న ఆమె 'సెలబ్రిటీ మాస్టర్‌చెఫ్ తమిళ్' షూటింగ్‌లో పాల్గొంటున్నారు. ఇందుకోసం చెన్నై వెళ్లినట్లు సమంత సన్నిహిత వర్గాలు తెలిపాయి. సమంతకు ప్రస్తుతం ఏడో నెల అని సమాచారం. ఈ ప్రత్యేక సమయంలోనూ ఆమె షూటింగ్‌లో పాల్గొనడం ఆసక్తిని పెంచుతోంది. ఈ కార్యక్రమంలో సమంత ఎలాంటి పాత్ర పోషించనున్నారనే దానిపై పూర్తి వివరాలు ఇంకా వెల్లడికాలేదు.కొత్త షోపై సమంత గతంలోనే తన ఉత్సాహాన్ని పంచుకున్నారు. తన కెరీర్‌లో ఇప్పటివరకు చేసిన కార్యక్రమాలకు ఇది పూర్తిగా భిన్నమైనదని చెప్పారు. ఆహారం మనుషులను దగ్గర చేస్తుందని.. కొత్త జ్ఞాపకాలను సృష్టిస్తుందని పేర్కొన్నారు."ఇప్పటివరకు నేను చేసిన వాటికి ఇది భిన్నమైన కార్యక్రమం. అందుకే ఈ అవకాశాన్ని కాదనలేకపోయా. ఆహారం మనుషులను కలుపుతుంది. జ్ఞాపకాలను సృష్టిస్తుంది. కెమెరాలకు సాధారణంగా కనిపించని మనలోని మరో కోణాన్ని బయటకు తీసుకొస్తుంది" అని సమంత చెప్పారు.తమ అభిమాన తమిళ సినీ తారలు వంటగదిలోకి అడుగుపెట్టి సాహసాలు చేయడం, తప్పులు చేయడం, తమను తాము ఆశ్చర్యపరచుకోవడం చూడాలని ఉందని ఆమె అన్నారు. కార్యక్రమంలో పాల్గొనే సెలబ్రిటీల పేర్లను మాత్రం సమంత వెల్లడించలేదు. "ఇప్పుడే ఎవరు వంట చేస్తున్నారో చెప్పేస్తే సరదా ఏముంటుంది?" అంటూ ఆసక్తి పెంచారు.అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన 'మాస్టర్‌చెఫ్' ఫార్మాట్ ఆధారంగా 'సెలబ్రిటీ మాస్టర్‌చెఫ్ తమిళ్' రూపొందుతోంది. తమిళ చిత్ర పరిశ్రమకు చెందిన ప్రముఖులు ఇందులో వంటల పోటీలో పాల్గొంటారు. తమిళ ప్రేక్షకులకు తగ్గట్టుగా స్థానిక అంశాలను జోడిస్తున్నారు.బనిజయ్ ఆసియా ఈ షోను నిర్మిస్తోంది. త్వరలో సోనీ విఖా, సోనీ లివ్‌లో ప్రసారం కానుంది. మరోవైపు సమంత తన భర్త, దర్శకుడు రాజ్ నిడిమోరుతో కలిసి తొలి బిడ్డ రాక కోసం ఎదురుచూస్తున్నారు.

### లైఫ్ స్కోర్‌కార్డు చెక్ చేస్తా..

## యమధర్మరాజు గెటప్‌లో సెహ్వాగ్..



టీమిండియా మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ తనదైన శైలిలో అభిమానులను మరోసారి ఆశ్చర్యపరిచారు. యమధర్మరాజు గెటప్‌లో గంభీరంగా కనిపిస్తున్న తన ఫొటోను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో అది కాస్తా వైరల్‌గా మారింది. తన ఫేస్‌బుక్ ఖాతాలో యముడి అవతారంలో ఉన్న ఫొటోను పంచుకున్న సెహ్వాగ్, దానికి తనదైన శైలిలో చమత్కారభరితమైన క్యాప్షన్‌ను జోడించాడు. "డెత్ ఓవర్లా? బ్యాటింగ్ కాదు, నేరుగా లైఫ్ స్కోర్‌కార్డును చెక్ చేయడానికి బయలుదేరాను" అని పేర్కొన్నాడు. క్రికెట్‌లో చివరి ఓవర్లను 'డెత్ ఓవర్లు'గా వ్యవహరిస్తాడు. ఈ పదాన్ని తన యముడి అవతారంతో ముడిపెడుతూ సెహ్వాగ్ చేసిన ఈ పోస్ట్ నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటోంది. కాగా, ఈ హల్‌చల్ అంతా అమెజాన్ ఎంఎక్స్ ప్లేయర్‌లో ప్రసారం కానున్న 'రైజ్ అండ్ ఫాల్ సీజన్ 2' అనే రియాలిటీ షో ప్రమోషన్‌లో భాగమే. ఈ షోకు సెహ్వాగ్ హోస్ట్‌గా వ్యవహరించనున్నాడు. కార్యక్రమంపై ఆసక్తిని పెంచే క్రమంలో వీరూ ఇప్పటికే డాక్టర్, స్కూల్ టీచర్, న్యూటన్ వంటి విభిన్న గెటప్‌లలోని ఫొటోలను పంచుకున్నాడు. అందులో భాగంగానే తాజాగా యముడి లుక్‌లో దర్శనమిచ్చాడు. సెహ్వాగ్ కొత్త లుక్‌పై అభిమానులు, నెటిజన్లు సరదాగా స్పందిస్తున్నారు. అతడి గెటప్‌ను చూసి కొందరు మహిషాసురుడు, రావణుడు, శని దేవుడితో పోలుస్తూ ఆసక్తికరమైన కామెంట్లు చేస్తున్నారు. నాడు మైదానంలో బ్యాట్‌తో బౌలర్లకు ముచ్చెమటలు పట్టించిన సెహ్వాగ్, నేడు సోషల్ మీడియాలో తనదైన పోస్టులతో అలరిస్తున్నాడని క్రీడాభిమానులు అభిప్రాయపడుతున్నారు.

### 800లకు పైగా

# ప్రీమియర్ షోలు..

**- నాని 'ది ప్యారడైజ్' మూవీకి సరికొత్త రికార్డులు!**



టాలీవుడ్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న మోస్ట్ అంటిసిపేటెడ్ యాక్షన్ థ్రిల్లర్ 'ది ప్యారడైజ్' చిత్రంపై ట్రేడ్ వర్గాలతో పాటు ప్రేక్షకుల్లోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. 'దసరా' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత దర్శకుడు శ్రీకాంత్ ఓదెల, నేచురల్ స్టార్ నాని కాంబినేషన్‌లో వస్తున్న ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులను సృష్టించేందుకు సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా, సినిమా విడుదలకు ముందే సరికొత్త ట్రెండ్‌కు తెరలేపారు. సెప్టెంబర్ 23న తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఏకంగా 800లకు పైగా భారీ ప్రీమియర్ షోలను ప్రదర్శించేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటివరకు విడుదలైన ఈ సినిమా ప్రచార చిత్రాలు, టీజర్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకున్నాయి. ఇందులో నాని ఇప్పటివరకు చూడని సరికొత్త రగ్గడ్ మరియు మాస్ లుక్‌లో కనిపించనున్నారు. సెప్టెంబర్ 24 నుంచి థియేటర్లలో 'జడల జమాన' అధికారికంగా ప్రారంభం కానుండటంతో నాని అభిమానులు, మాస్ ఆడియెన్స్ ఈ సినిమా కోసం అత్యుత్సాహంతో ఎదురుచూస్తున్నారు. ట్రెండింగ్ మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్ ఈ చిత్రానికి అదిరిపోయే సంగీతం అందిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా అత్యంత గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు.

# 'భరత్ నాట్యం' మూవీ రివ్యూ!



మలయాళంలో సైజు కురుప్ కి మంచి ఇమేజ్ ఉంది. ఆయన ఎంచుకునే కథలు .. పాత్రలు అందుకు కారణమని చెప్పాలి. ఆయన కథానాయకుడిగా నటించిన సినిమానే 'భరత్ నాట్యం'. 2024 లో ఆగస్టు 30వ తేదీన ఈ సినిమాను థియేటర్లలో విడుదల చేశారు. కామెడీ డ్రామా జోనర్లో రూపొందిన ఈ సినిమాకి థియేటర్ల వైపు నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. అలాంటి ఈ సినిమా ఈ నెల 10వ తేదీ నుంచి 'ఆహా'లో అందుబాటులోకి వచ్చింది. భరత్ నాయుడు ( మలయాళ సాయికుమార్) పదవీ విరమణ తరువాత ఇంటిపట్టునే ఉంటాడు. ఆయన భార్య 'సరస్వతి' ఆయనను అపురూపంగా చూసుకుంటూ ఉంటుంది.పెద్ద కొడుకు శశిధర్ ( సైజు కురుప్) పొలాలు .. తోటలు అందుకు సంబంధించిన వ్యవహారాలు చూసుకుంటూ ఉంటాడు. ఇక పై చదువులకు పట్నం వెళ్లాలనేది చిన్న కొడుకు అరుణ్ (జినిల్) ఆలోచన. పెద్ద కూతురు 'శాంతి' ఆమె భర్త 'అశోకన్' ఆ ఇంట్లోనే ఉంటూ ఉంటారు. ఈ నేపథ్యంలోనే ఆర్థికపరమైన ఇబ్బందుల కారణంగా, చిన్న కూతురు శ్రీలత .. ఆమె భర్త గోపాలన్ కూడా ఆ ఇంటికి చేరతారు. ఈ నేపథ్యంలోనే భరత్ నాయుడికి గుండెపోటు వస్తుంది. వెంటనే ఆయనను హాస్పిటల్లో చేరుస్తారు. ఆయన పరిస్థితి కష్టంగానే ఉందని డాక్టర్ చెబుతుంది. ఆ సమయంలోనే భరత్ నాయుడు తన పెద్ద కొడుకైన శశిధర్ ను పిలిచి, తనకి రెండో భార్య ఉందనీ .. ఆమెకి 'అజయ్' అనే కుమారుడు కూడా ఉన్నాడనే ఒక నిజాన్ని చెబుతాడు. వాళ్లిద్దరినీ చూడాలని ఉందనీ, శ్రీకంఠపురం వెళ్లి వాళ్లను తీసుకురమ్మని కోరతాడు. తండ్రి చివరి మాటను తల్లితో చెప్పి ఒప్పిస్తాడు శశిధర్. శ్రీకంఠపురం నుంచి రుక్మిణీ – అజయ్ లను తీసుకొస్తాడు. అయితే ఊహించని విధంగా భరత్ నాయుడు కోలుకుంటాడు. దాంతో రుక్మిణీ – అజయ్ లను ఊరికి పంపించేయాలని చూస్తాడు శశిధర్. కుదరకపోవడంతో తన ఇంట్లోనే పై గదిలో వాళ్లను రహస్యంగా ఉంచుతాడు. వాళ్లు ఊళ్లో ఎవరి కంట్లో పడకుండా మేనేజ్ చేస్తుంటాడు. ఆస్తిలో వాళ్లు వాటా అడుగుతారేమోనని శశిధర్ భయపడతాడు. సరస్వతితో పెళ్లి రిజిస్టర్ కాలేదనీ, రుక్మిణితో పెళ్లికి సంబంధించిన డాక్యుమెంట్స్ పక్కాగా ఉన్నాయనే విషయం ఆ సమయంలోనే అతనికి తెలుస్తుంది. అప్పుడు శశిధర్ ఏం చేస్తాడు? చివరికి ఆస్తి ఎవరికి దక్కుతుంది? అనేది కథ.

తండ్రి చావు బ్రతుకులలో ఉండగా, ఆయనకి రెండో ఫ్యామిలీ ఉందనే విషయం శశిధర్ కి తెలుస్తుంది. ఆయన చివరి కోరికను తీర్చడం కోసం, ఆ ఫ్యామిలీని తీసుకొస్తాడు. భరత్ నాయుడు మొదటి పెళ్లికి సంబంధించి ఎలాంటి ఆధారాలు ఉండవు. కానీ రెండో పెళ్లికి సంబంధించిన అన్ని ఆధారాలు పక్కాగా ఉంటాయి. దాంతో తనకి దక్కుతుందని భావించిన ఆస్తులకు రెక్కలు వచ్చాయని భయపడిన శశిధర్ ఏం చేస్తాడనేదే ఈ కథలోని ప్రధానమైన అంశం. ఉమ్మడి కుటుంబంలోని సమస్యలు .. బరువు బాధ్యతలు .. తండ్రికి సీరియస్ కావడం .. అతనికి సెకండ్ ఫ్యామిలీ ఉందని తెలియడం .. వాళ్లను ఊరు నుంచి తీసుకురావడం వంటి సన్నివేశాలతో ఫస్టాఫ్ నడుస్తుంది. తండ్రికి సెకండ్ ఫ్యామిలీ ఉందనే నిజం బయటికి తెలియకుండా దాచడానికి చేసే ప్రయత్నాలు .. ఆస్తుల విషయంలో అభద్రతా భావం తాలూకు సన్నివేశాలు సెకండాఫ్ లో ప్రేక్షకుల ముందుకు వస్తాయి. దర్శకుడు ఈ కథను మొదటి నుంచి చివరివరకూ చాలా పట్టుగా నడిపించాడు. సహజత్వంతో కూడిన సన్నివేశాలను, ఆసక్తికరంగా ఆవిష్కరిస్తూ వెళ్లాడు. కావాలని ఇరికించినట్టుగా కాకుండా, సున్నితమైన హాస్యాన్ని పండిస్తూ వెళ్లాడు. తన తండ్రికి సెకండ్ ఫ్యామిలీ ఉందనే విషయం ఊళ్లోవాళ్లకి తెలియకుండా దాచడం కోసం శశిధర్ పడే పాట్లు, అతని ఇంట్లో ఏం జరుగుతుందో తెలుసుకోవడానికి సన్నిహితులు చేసే ప్రయత్నాలు సరదాగా నవ్విస్తాయి. ముఖ్యంగా భరత్ నాయుడు మొదటి భార్య రెండో కొడుకు అరుణ్ .. రెండో భార్య కొడుకు అజయ్ లను ట్విన్స్ గా డిజైన్ చేసిన తీరు గొప్పగా అనిపిస్తుంది. ఈ ఇద్దరూ ఒకే చోట కనిపిస్తే ఊళ్లో వాళ్లకు డౌట్ వస్తుందనే ఉద్దేశంతో నడిపించే ఒక కన్ఫ్యూజన్ డ్రామా కామెడీని బాగా వర్కౌట్ చేసింది. ఈ సినిమాను వినోదభరితంగా మరింత బలంగా మార్చడానికి ఈ ట్రాక్ బాగా ఉపయోగపడిందని చెప్పాలి. దర్శకుడు ఈ కథలోని పాత్రలను మలిచిన తీరు .. వాటిని నడిపించిన విధానం ఆకట్టుకుంటుంది. ఆశలు .. అవసరాలు .. ఆపదలు .. ఆస్తులు అనేవి మనుషుల స్వభావాలను ఎలా మారుస్తాయి? అనే అంశాన్ని దర్శకుడు తెరమీదకి తీసుకొచ్చిన తీరు ఆలోచింపజేస్తుంది. ఆస్తుల కంటే బంధాలు .. అనుబంధాలు గొప్పవి. ఒక వ్యక్తిని ప్రేమించడమంటే ఆ వ్యక్తిలోని బలహీనతలను అర్థం చేసుకుని అంగీకరించడం అనే సందేశాన్ని ఇచ్చిన సినిమా ఇది. కథాకథనాలు ఈ సినిమాకి ప్రధానమైన బలం అని చెప్పాలి. బబ్లూ ఫొటోగ్రఫీ .. శామ్యూల్ సంగీతం .. షఫీక్ ఎడిటింగ్ ఈ కంటెంట్ ను నెక్స్ట్ లెవెల్ కి తీసుకుని వెళ్లాయని చెప్పాలి. నటీనటులంతా తమ పాత్రలకు జీవం పోశారు. సందేశం .. వినోదం సమపాళ్లలో కలిసిన ఈ సినిమాను ఫ్యామిలీతో కలిసి సరదాగా చూడొచ్చు.

# కాణిపాకం వినాయకుడికి పట్టువస్త్రాలు

- బ్రహ్మోత్సవాల సందర్భంగా ఇంద్రకీలాద్రి నుంచి సమర్పణ
- పాల్గొన్న దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం: చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈఓ శీనానాయక్



ఇంద్రకీలాద్రి(ప్రశ్న న్యూస్) కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని విజయవాడ శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం తరఫున గురువారం పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), కార్యనిర్వహణాధికారి వి.కె.శీనానాయక్ ఆధ్వర్యంలో అర్చకులు, ట్రస్టుబోర్డు సభ్యులు, వైదిక కమిటీ సభ్యులు కాణిపాకం చేరుకుని స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా కాణిపాకం దేవస్థానం కార్యనిర్వహణాధికారి పెంచల కిషోర్ వారికి స్వాగతం పలికి ఆలయ మర్యాదలతో సత్కరించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారికి ప్రత్యేకంగా పట్టువస్త్రాలు సమర్పించి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ప్రధాన అర్చకులు లింగంబొట్ల దుర్గా ప్రసాద్, ఉప ప్రధాన అర్చకులు కోట రవికుమార్, ముఖ్య అర్చకులు ఆర్.శ్రీనివాస శాస్త్రి, వైదిక కమిటీ సభ్యులు వి.శ్రీధర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

# పరిశుభ్రతపై నిర్లక్ష్యం.. చర్యలు

- తిరుపతి నగరంలో పారిశుధ్యంపై కమిషనర్ జయకృష్ణ తనిఖీలు



తిరుపతి(ప్రశ్న న్యూస్) నగరంలో పారిశుధ్య నిర్వహణపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.జయకృష్ణ హెచ్చరించారు. గురువారం ఉదయం ఆయన నగరంలోని పలు ప్రాంతాల్లో ఆకస్మికంగా పర్యటించి పారిశుధ్య పరిస్థితులను పరిశీలించారు.రాజన్న పార్కు, పద్మావతి పార్కు, శ్రీనివాసం, విష్ణు నివాసం, బస్టాండ్, రైల్వేస్టేషన్, వినాయక సాగర్ ప్రాంతాల్లో పర్యటించిన కమిషనర్ పారిశుధ్య నిర్వహణపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.పద్మావతి పార్కు ఉదయం సమయానికి తెరవకపోవడంపై సంబంధిత సిబ్బందిని ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. శ్రీనివాసం, విష్ణు నివాసం పరిసరాల్లో పారిశుధ్యం సక్రమంగా లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసి తక్షణమే మెరుగుపర్చాలని సిబ్బందికి సూచించారు.బస్టాండ్, రైల్వేస్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని, ప్రజలు, ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.

### వినాయక సాగర్‌పై ప్రత్యేక దృష్టి

వినాయక సాగర్ ప్రాంతాన్ని నిరంతరం పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కమిషనర్ సూచించారు. నిమజ్జనం అనంతరం ఏర్పడే వ్యర్థాలను అక్కడే పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని పారిశుధ్య సిబ్బందిని ఆదేశించారు.నగరంలోని ప్రధాన ప్రజా ప్రదేశాలు, పార్కులు, రవాణా కేంద్రాల్లో పారిశుధ్య నిర్వహణలో లోపాలు పునరావృతం కాకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కమిషనర్ జయకృష్ణ స్పష్టం చేశారు.

# గరుడ సేవకు ట్రాఫిక్ కట్టడి

- 18 రాత్రి నుంచి ఘాట్‌రోడ్డుపై ద్విచక్ర వాహనాలకు నో ఎంట్రీ
- పార్కింగ్ ప్రదేశాల నుంచి తిరుమలకు 24 గంటలూ ఆర్టీసీ బస్సులు
- తిరుపతిలో ప్రత్యేక బందోబస్తు.. అత్యవసర వాహనాలకు ప్రత్యేక మార్గాలు

**తిరుపతి(ప్రశ్న న్యూస్)** శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో అత్యంత ప్రధానమైన గరుడ వాహన సేవ ఈ నెల 19న జరగనున్న నేపథ్యంలో తిరుపతి నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో వాహనాల రాకపోకలు, పార్కింగ్, ఘాట్‌రోడ్డు భద్రతపై ప్రత్యేక దృష్టి సారించినట్లు జిల్లా ఎస్పీ యల్.సుబ్బరాయుడు, ఐపీఎస్. తెలిపారు.జిల్లా యంత్రాంగం, టీటీడీ, విజిలెన్స్, ఆర్టీసీ తదితర శాఖల సమన్వయంతో బందోబస్తు, ట్రాఫిక్ నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.



### ఘాట్‌రోడ్డుపై బైక్‌లకు నో

భక్తుల భద్రత దృష్ట్యా సెప్టెంబరు 18 రాత్రి 9 గంటల నుంచి సెప్టెంబరు 20 ఉదయం 6 గంటల వరకు తిరుమల--తిరుపతి ఘాట్‌రోడ్డులో ద్విచక్ర వాహనాలకు అనుమతి ఉండదు.ద్విచక్ర వాహనదారులకు ఇబ్బంది కలగకుండా తిరుపతిలో ప్రత్యేక పార్కింగ్ సదుపాయాలు ఏర్పాటు చేశారు. బాలాజీ లింక్ బస్టాండ్, నెహ్రూ మున్సిపల్ గ్రౌండ్, ఎస్వీ మెడికల్ కాలేజీ గ్రౌండ్, ఇస్కాన్ గ్రౌండ్‌లలో పార్కింగ్ ఏర్పాటు చేశారు.

### పార్కింగ్ నుంచి తిరుమలకు బస్సులు

ప్రైవేటు వాహనాలతో తిరుమలకు వెళ్లకుండా భక్తులు ఆర్టీసీ బస్సులను వినియోగించాలని పోలీసులు సూచించారు. కేటాయించిన పార్కింగ్ ప్రాంతాల నుంచి తిరుమలకు చేరుకునేందుకు టీటీడీ, ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక రవాణా ఏర్పాట్లు చేశారు. 24 గంటలూ బస్సులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టారు.దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు పార్కింగ్ ప్రదేశాలపై ముందస్తు అవగాహన కల్పించేందుకు సామాజిక మాధ్యమాలు, ఫ్లెక్సీల ద్వారా క్యూఆర్ కోడ్‌తో కూడిన సమాచారాన్ని అందుబాటులో ఉంచారు.

### టూరిస్టు బస్సులకు ప్రత్యేక పార్కింగ్

వివిధ ప్రాంతాల నుంచి వచ్చే టూరిస్టు బస్సులకు జూపార్కు రోడ్డులోని దేవలోక్, ట్రైడెంట్, మ్యాంగో మార్కెట్ వద్ద పార్కింగ్ సదుపాయం కల్పించారు.నాలుగు చక్రాల వాహనాలను భారతీయ విద్యాభవన్, అలిపిరి లింక్ బస్టాండ్, ఎస్వీ మెడికల్ కాలేజీ గ్రౌండ్, ఎస్వీ ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్‌లలో నిలిపేలా ఏర్పాట్లు చేశారు. కేటాయించిన పార్కింగ్ ప్రదేశాల్లోనే వాహనాలను నిలిపి, వీలైనంత వరకు ఆర్టీసీ, టీటీడీ రవాణా సేవలను వినియోగించి గరుడ సేవను ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# కొండ ప్రాంతాలకు కొండంత భరోసా!

- 48 సున్నిత ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి
- 2 లక్షల మందికి భద్రత..
- పునరావాసం, గృహ వసతులపై కార్యాచరణ
- పశ్చిమ నియోజకవర్గం నుంచి ప్రణాళిక అమలుకు శ్రీకారం



**విజయవాడ (ప్రశ్న న్యూస్)** విజయవాడ నగరంలోని కొండ ప్రాంతాల ప్రజల భద్రత, పునరావాసం, గృహ వసతి, మౌలిక సదుపాయాలపై సమగ్ర కార్యాచరణ రూపొందించేందుకు గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వర్షాలు, వరదల సమయంలో ఎదురయ్యే సమస్యలకు తాత్కాలిక పరిష్కారాలతో కాకుండా దీర్ఘకాలిక ప్రణాళికతో ముందుకు వెళ్లాలని సమావేశంలో నిర్ణయించారు.నగరంలోని 192 మైక్రో పాకెట్ల పరిధిలో దాదాపు రెండు లక్షల మంది నివసిస్తున్నట్లు అధికారులు వివరించారు. ఇంద్రకీలాద్రి, విన్సీపేట, గుణదల, గాంధీహిల్ తదితర కొండ ప్రాంతాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం, ఇతర మౌలిక వసతుల పరిస్థితిపై చర్చించారు. వర్షాల సమయంలో సమస్యలు తలెత్తే 48 సున్నిత ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని నిర్ణయించారు.ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూనే అవసరమైన చోట పునరావాసం, పట్టణ గృహ వసతి కల్పించే మార్గాలను పరిశీలించాలని సమావేశంలో అభిప్రాయపడ్డారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా క్షేత్రస్థాయి పరిస్థితులను అధ్యయనం చేసి దశలవారీగా చర్యలు చేపట్టాలని సూచించారు.

# భక్తుల కొంగుబంగారం.. జొన్నవాడ కామాక్షితాయి

- కోరిన కోరికలు తీరితే మొక్కులు చెల్లించేందుకు భక్తుల రాక
- రెండున్నరేళ్లలో హుండీ కానుకలతో రూ.2.60 కోట్ల ఆదాయం
- తెలుగు రాష్ట్రాల నుంచే కాదు.. దేశవిదేశాల నుంచి తరలివస్తున్న భక్తులు

**జొన్నవాడ(ప్రశ్న న్యూస్)** నెల్లూరు జిల్లా ప్రతినిధి మల్లికార్జున్ నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాళెం మండలం జొన్నవాడలో కొలువుదీరిన శ్రీ మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి ఆలయం భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తోంది. కోరిన కోరికలు నెరవేరితే అమ్మవారికి మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. బ్రహ్మోత్సవాల సమయంలో ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడుతుంటాయి. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి, విదేశాల నుంచి కూడా భక్తులు జొన్నవాడకు వచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటున్నారు.



### కోరికలు తీరితే.. మొక్కులు చెల్లించేందుకు

కామాక్షితాయి అమ్మవారిని దర్శించుకుంటే కోరిన కోరికలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. కుటుంబ సౌఖ్యం, ఆరోగ్యం, సంతానం, విద్య, ఉద్యోగం, వ్యాపారాభివృద్ధి తదితర కోరికలు నెరవేరాలని అమ్మవారిని వేడుకునే భక్తులు.. తమ కోరికలు ఫలించిన అనంతరం తిరిగి ఆలయానికి వచ్చి మొక్కులు చెల్లించుకుంటున్నారు. దీంతో సాధారణ రోజుల్లోనూ ఆలయానికి భక్తుల రాక కొనసాగుతోంది.బ్రహ్మోత్సవాల సమయంలో ప్రత్యేక పూజలు, ఉత్సవాలు నిర్వహించడంతో భక్తుల సందడి మరింత పెరుగుతుంది. స్వామి, అమ్మవార్ల దర్శనం కోసం సుదూర ప్రాంతాల నుంచి కుటుంబ సమేతంగా వచ్చే భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరిస్తున్నారు.

### రూ.2.60 కోట్లకు చేరిన ఆదాయం

భక్తులు స్వామి, అమ్మవార్లకు సమర్పించిన కానుకల ద్వారా ఆలయానికి గత రెండున్నర సంవత్సరాల్లో రూ.2.60 కోట్ల ఆదాయం సమకూరినట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. భక్తుల విశ్వాసానికి, ఆలయంపై ఉన్న ఆదరణకు ఈ ఆదాయం నిదర్శనంగా నిలుస్తోందని పేర్కొంటున్నారు.కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆలయ అభివృద్ధిపై దృష్టి సారిస్తున్నారని ఆలయ వర్గాలు చెబుతున్నాయి. భక్తులకు అవసరమైన సౌకర్యాలను మెరుగుపరచడంతో పాటు ఆలయ ప్రాంగణంలో పరిశుభ్రత, తాగునీరు, క్యూలైన్లు, ఇతర మౌలిక వసతులపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

### ఒక్కసారైనా దర్శించండి..

జొన్నవాడ కామాక్షితాయి అమ్మవారి ఆలయం ఆధ్యాత్మికంగా ప్రత్యేకత కలిగిన పుణ్యక్షేత్రంగా భక్తులలో పేరొందింది. ప్రశాంతమైన వాతావరణంలో కొలువైన స్వామి, అమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహిస్తే మనసుకు ప్రశాంతత లభిస్తుందని భక్తులు చెబుతున్నారు.జీవితంలో ఒక్కసారైనా జొన్నవాడకు వచ్చి మల్లికార్జునస్వామి, కామాక్షితాయి అమ్మవారిని దర్శించుకుని వారి కరుణాకటాక్షాలకు పాత్రులు కావాలని ఆలయ వర్గాలు భక్తులను ఆహ్వానిస్తున్నాయి..

# బిఫోర్ మోదీ.. ఆఫ్టర్ మోదీ

- భారత రూపురేఖల్లో గణనీయ మార్పులు: ఎమ్మెల్యే గల్లా మాధవి
- గుంటూరు పశ్చిమలో ఘనంగా ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు



గుంటూరు(ప్రశ్న న్యూస్) ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి అన్నారు. "బిఫోర్ మోదీ.. ఆఫ్టర్ మోదీ"గా భారతదేశ రూపురేఖల్లో గణనీయమైన మార్పులు కనిపిస్తున్నాయని ఆమె పేర్కొన్నారు. ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని గురువారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గం 18వ డివిజన్‌లోని భారతమాత విగ్రహం వద్ద బీజేపీ జిల్లా అధ్యక్షుడు తిరుపతిరావు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే గల్లా మాధవి భారతమాత విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి పూలమాల వేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాధారణ కుటుంబం నుంచి దేశ అత్యున్నత పదవికి ఎదిగిన మోదీ ప్రస్థానంలో కృషి, క్రమశిక్షణ, నిబద్ధత, అంకితభావం ఉన్నాయని అన్నారు.కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు తిరుపతిరావుతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలను ఎమ్మెల్యే అభినందించారు. స్థానిక ప్రజలు ఉచిత టీ పంపిణీ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# తెలంగాణ విమోచన దిన వేడుకలు



నాచారం (ప్రశ్న న్యూస్) బీజేపీ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు మేడ్చల్ జిల్లా కౌన్సిల్ సభ్యుడు సంగిశెట్టి రవీంద్ర సాగర్ ఆధ్వర్యంలో శక్తి సాయినగర్ డివిజన్ బీజేపీ కార్యాలయంలో తెలంగాణ విమోచన దిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు వీరన్న, నరేష్, లక్ష్మి, శ్రీనివాస్‌తో పాటు బీజేపీ మహిళా, యువ కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంగిశెట్టి రవీంద్ర సాగర్ మాట్లాడుతూ 1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం కాలేదన్నారు. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ కృషి, పట్టుదలతో హైదరాబాద్ భారతదేశంలో అంతర్భాగమైందని తెలిపారు. తెలంగాణ విమోచన దినోత్సవం చారిత్రక ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని అన్నారు.

# ఏసీబీ వలలో కీసర సీఐ, ఎస్ఐ

- రూ.5 లక్షల లంచం తీసుకుంటూ ఎస్ఐ రెడ్‌హ్యాండెడ్
- స్టేషన్ బెయిల్ కోసం రూ.10 లక్షలు డిమాండ్ చేశారన్న ఆరోపణలు
- కీసర చెరువు వద్ద కారులో నగదు స్వీకరణ.. ఇద్దరి అరెస్ట్




**కీసర ( ప్రశ్న న్యూస్ )** మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కీసర పోలీస్‌స్టేషన్‌లో ఏసీబీ అధికారులు నిర్వహించిన ట్రాప్ ఆపరేషన్ కలకలం రేపింది. కీసర సీఐ అర్కపల్లి ఆంజనేయులు, ఎస్ఐ ద్యాప జ్ఞానేందర్ రెడ్డిని అవినీతి నిరోధక శాఖ అధికారులు అరెస్ట్ చేశారు. ఏసీబీ వివరాల ప్రకారం.. కీసర పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఓ కేసులో స్టేషన్ బెయిల్ ఇప్పించడంతో పాటు వేధింపులు లేకుండా ఉండేందుకు బాధితుడి నుంచి లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. మొదట రూ.10 లక్షలు డిమాండ్ చేసి, చివరకు రూ.5 లక్షలకు ఒప్పందం కుదిరినట్లు సమాచారం. సీఐ ఆదేశాల మేరకు ఎస్ఐ జ్ఞానేందర్ రెడ్డి లంచం తీసుకున్నట్లు ఏసీబీ పేర్కొంది.ఈ క్రమంలో సెప్టెంబర్ 16 అర్ధరాత్రి కీసర చెరువు సమీపంలో నిమజ్జనం డ్యూటీలో ఉన్న ఎస్ఐ కారులో రూ.5 లక్షలు స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ అధికారులను గమనించిన ఎస్ఐ తప్పించుకునేందుకు ప్రయత్నించినట్లు కెమికల్ టెస్టులు చేయించుకోకుండా ముప్పతిప్పలు పెట్టాడు. అనంతరం లంచం మొత్తాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు కీసర పోలీస్‌స్టేషన్‌తో పాటు సంబంధిత ప్రదేశాల్లో సోదాలు నిర్వహించారు. బాధితుడిని కొంతకాలంగా స్టేషన్‌కు పిలిపించి ఇబ్బందులకు గురిచేయడంతో పాటు బిర్యానీలు, కూల్‌డ్రింక్స్ తీసుకురావాలని కోరినట్లు కూడా ఆరోపణలు నమోదయ్యాయి. వేధింపులు తట్టుకోలేక బాధితుడు ఏసీబీని ఆశ్రయించడంతో అధికారులు పక్కా ప్రణాళికతో వల పన్నినట్లు సమాచారం. సీఐ, ఎస్ఐ ఇద్దరినీ ఏసీబీ అధికారులు అరెస్ట్ చేసి నాంపల్లి ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరచేందుకు చర్యలు చేపట్టారు. కేసుపై దర్యాప్తు కొనసాగుతోంది.

# శ్రీకాళహస్తిలో వైభవంగా వినాయక చవితి వేడుకలు

- పూజల్లో పాల్గొన్న :మాజీ దేవస్థాన చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీకాళహస్తి పట్టణంలోని కావమ్మ గుడి వీధిలో గణపతి హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వీధిలో ఏర్పాటు చేసిన వినాయకుడి ప్రతిమ వద్ద శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు, హోమ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడిని దర్శించుకుని పూజలు చేశారు.ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి అంజూరు తారక శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కావమ్మ గుడి వీధి యువజన సంఘం సభ్యులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, గణపతి హోమంలో పాల్గొన్నారు. మహాపూర్ణాహుతి కార్యక్రమంలో హోమ ద్రవ్యాలను సమర్పించారు.

### ఘనంగా సత్కారం

హోమం అనంతరం వేద పండితులు, కార్యక్రమ నిర్వాహకులు అంజూరు తారక శ్రీనివాసులను సత్కరించారు. స్వామివారి శేషవస్త్రం కప్పి గౌరవించి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగా నిర్వహించే ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు యువతను సనాతన సంప్రదాయాలకు దగ్గర చేస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆవులపాటి శ్రీనివాసరావు, వెంకీ, ఆకాశ్, కాట్రపల్లి చంద్రశేఖర్‌రావు, మొగరాల గణేష్, కావమ్మ గుడి వీధి యువజన సంఘం ప్రతినిధులు, స్థానిక నాయకులు, భక్తులు, వీధి ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# అమ్మవారి సన్నిధిలో అన్నప్రసాదం..

# భక్తులకు ఆత్మీయ సేవ

- ఇంద్రకీలాద్రిపై కొత్తగా అన్నదాన క్యాంటీన్ ప్రారంభం
- వేడివేడి అన్నం రుచికరమైన భోజనంతో భక్తులకు సంతృప్తి
- పలు రకాల కూరలు.. శుభ్రతకు ప్రాధాన్యం
- దర్శనానికి వచ్చే భక్తులకు ఎంతో ఉపయోగకరంగా కొనసాగుతున్న అన్నదాన కార్యక్రమం



**విజయవాడ(ప్రశ్న న్యూస్)**(ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు మరో ఆత్మీయ సేవ అందుబాటులోకి వచ్చింది. అమ్మవారి సన్నిధిలో కొత్తగా ఏర్పాటు చేసిన అన్నదాన క్యాంటీన్‌లో భక్తులకు అన్నప్రసాద వితరణ కొనసాగుతోంది. దర్శనం కోసం కొండపైకి చేరుకునే భక్తులకు ఆకలి తీర్చడంతోపాటు సంతృప్తికరమైన భోజనాన్ని అందించాలనే ఉద్దేశంతో నిర్వహిస్తున్న ఈ సేవకు భక్తుల నుంచి మంచి స్పందన లభిస్తోంది.

## భక్తులకు అందుబాటులో అన్నప్రసాదం

అమ్మవారి దర్శనం కోసం వివిధ ప్రాంతాల నుంచి ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివస్తుంటారు. కుటుంబాలతో, వృద్ధులు, చిన్నారులతో వచ్చే భక్తులకు భోజన సదుపాయం ఒక ముఖ్యమైన అవసరంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో కొత్తగా ఏర్పాటు చేసిన అన్నదాన క్యాంటీన్ భక్తులకు ఉపయోగకరంగా మారుతోంది. దర్శనం అనంతరం భక్తులు ప్రశాంతంగా కూర్చొని భోజనం చేసేలా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.



## రుచికి పెద్దపీట

అన్నదాన క్యాంటీన్‌లో భక్తులకు అందిస్తున్న భోజనంలో రుచికి, నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తున్నారు. వేడి వేడి అన్నంతో పాటు వివిధ రకాల కూరలు, ఇతర భోజన పదార్థాలను అందిస్తున్నారు. సాధారణ అన్నదాన కార్యక్రమానికి భిన్నంగా భక్తులు సంతృప్తిగా భోజనం చేసేలా వంటకాల తయారీ, వడ్డింపు విధానంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. భోజనం రుచికరంగా ఉండటంతో భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

## శుభ్రతకు ప్రాధాన్యం

భక్తులకు భోజనం అందించే ప్రదేశంలో పరిశుభ్రత అత్యంత కీలకం. ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకుని క్యాంటీన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు చేపడుతున్నారు. భోజన పదార్థాల తయారీ, వడ్డింపు, భక్తులు భోజనం చేసే ప్రదేశంలో శుభ్రతను పాటించేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. భక్తులకు పరిశుభ్రమైన వాతావరణంలో అన్నప్రసాదం అందేలా నిర్వహణ కొనసాగుతోంది.

## వృద్ధులు, కుటుంబాలకు వెసులుబాటు

అమ్మవారి దర్శనానికి వచ్చే ప్రతి భక్తుడికి అన్నదాన కార్యక్రమం ఉపయోగకరంగా ఉంటుంది. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులతో వచ్చే కుటుంబాలకు క్యాంటీన్‌లో అందుతున్న అన్నప్రసాదం మరింత సౌకర్యాన్ని కల్పిస్తోంది. బయట భోజనం కోసం వెతుక్కోవాల్సిన అవసరం లేకుండా ఆలయ పరిసరాల్లోనే భోజనం లభించడం భక్తులకు ఉపయుక్తంగా మారింది.

## అన్నదానం.. ఆధ్యాత్మిక సేవ

హిందూ ధర్మంలో అన్నదానానికి విశిష్టమైన స్థానం ఉంది. ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం అత్యున్నత సేవగా భావిస్తారు. అమ్మవారి సన్నిధిలో జరుగుతున్న ఈ అన్నదాన కార్యక్రమం కూడా భక్తులకు కేవలం భోజనాన్ని అందించడమే కాకుండా సేవాభావాన్ని చాటుతోంది. అమ్మవారి దర్శనం చేసుకున్న అనంతరం అన్నప్రసాదాన్ని స్వీకరించడం భక్తుల్లో ప్రత్యేకమైన ఆధ్యాత్మిక అనుభూతిని కలిగిస్తోంది.

## భక్తుల సంతృప్తే లక్ష్యంగా..

కొత్తగా ప్రారంభమైన అన్నదాన క్యాంటీన్ ద్వారా భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు నిర్వాహకులు కృషి చేస్తున్నారు.

భక్తుల రద్దీకి అనుగుణంగా భోజన ఏర్పాట్లు చేయడం, అవసరమైన సదుపాయాలను అందుబాటులో ఉంచడం, వంటకాల నాణ్యతను కొనసాగించడం వంటి అంశాలపై దృష్టి సారిస్తున్నారు.ఇంద్రకీలాద్రిపై అమ్మవారి దర్శనం కోసం వచ్చే భక్తులకు దర్శనం.. అన్నప్రసాదం.. ఆత్మీయ సేవ ఒకేచోట లభించేలా కొత్త అన్నదాన క్యాంటీన్ రూపుదిద్దుకుంటోంది. భక్తులకు రుచికరమైన భోజనాన్ని అందిస్తూ, శుభ్రతకు ప్రాధాన్యం ఇస్తూ అన్నదాన కార్యక్రమాన్ని కొనసాగించడం ద్వారా ఆలయ సేవల్లో ఇది మరో ముఖ్యమైన అధ్యాయంగా నిలుస్తోంది.

# పాడైన మాంసం.. అపరిశుభ్ర వంటగది

- కుంభకర్ణ రెస్టారెంట్ కిచెన్ తాత్కాలిక మూసివేత
- ఫ్రీజర్‌లో పాడైన చికెన్, మటన్, తందూరీ చికెన్, కబాబ్‌లు
- 6 కిలోల ఆహార పదార్థాలు ధ్వంసం..
- 13 నమూనాలు సేకరణ
- ఐపీఎం డైరెక్టర్ అరుణ్‌బాబు ఆకస్మిక తనిఖీతో వెలుగులోకి వచ్చిన లోపాలు



**మంగళగిరి(ప్రశ్న న్యూస్)** కస్టమర్లకు నాణ్యమైన ఆహారం అందించాల్సిన రెస్టారెంట్ వంటగదిలో పాడైన మాంసం.. అపరిశుభ్ర వాతావరణం.. గడువు ముగిసిన పదార్థాలు.. లేబుళ్లు లేని మసాలా పొడులు.. మురుగునీటి కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలు.. ఆహార తయారీలో ఉపయోగించకూడని రంగుల పదార్థాలు దర్శనమిచ్చాయి. మంగళగిరి కాజా టోల్‌ప్లాజా సమీపంలోని కుంభకర్ణ మల్టీ క్యూజీన్ ఫ్యామిలీ రెస్టారెంట్‌లో బుధవారం సాయంత్రం నిర్వహించిన తనిఖీల్లో ఈ లోపాలు బయటపడ్డాయి. దీంతో రెస్టారెంట్ వంటగది కార్యకలాపాలను అధికారులు తాత్కాలికంగా నిలిపివేశారు.ఆహార భద్రత విభాగం (ఐపీఎం) డైరెక్టర్ అరుణ్‌బాబు స్వయంగా తనిఖీ నిర్వహించి వంటగదిలోని పరిస్థితులను పరిశీలించారు. ఆయనతో పాటు సహాయ ఆహార నియంత్రణ అధికారి ఎన్.పూర్ణచంద్రరావు, ఆహార భద్రత అధికారులు బి.నరసింహుడు, ఎన్.వెంకటేశ్వర్లు తనిఖీలో పాల్గొన్నారు. తనిఖీ అనంతరం వంటగది కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేస్తూ యాజమాన్యానికి నోటీసు జారీ చేశారు.

## ఫ్రీజర్‌లో పాడైన మాంసం

తనిఖీ సందర్భంగా ఫ్రీజర్‌లో నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను అధికారులు పరిశీలించారు. అందులో పాడైన ముడి బోన్‌లెస్ చికెన్ 500 గ్రాములు, వండిన చికెన్ కూర 500 గ్రాములు, వండిన మటన్ 500 గ్రాములు ఉన్నట్లు గుర్తించారు. వీటితో పాటు తందూరీ చికెన్ 2.5 కిలోలు, చికెన్ తంగ్డీ కబాబ్ 1.5 కిలోలు, ఆటా పిండి 500 గ్రాములు ఉన్నట్లు అధికారులు గుర్తించారు.మొత్తంగా సుమారు 6 కిలోల ఆహార పదార్థాలను అక్కడికక్కడే ధ్వంసం చేసినట్లు ఆహార భద్రత అధికారులు వెల్లడించారు. వినియోగానికి అనర్హంగా మారిన ఆహార పదార్థాలను నిల్వ చేయడం వల్ల ఆహార భద్రతపై తీవ్ర ప్రశ్నలు తలెత్తుతున్నాయని అధికారులు పేర్కొన్నారు.

## గడువు ముగిసిన పదార్థాలు

వంటగది, నిల్వ ప్రాంతాలను పరిశీలించిన అధికారులు గడువు ముగిసిన కొన్ని పదార్థాలను కూడా గుర్తించారు. స్కిమ్డ్ మిల్క్ డెయిరీ వైటెనర్ పౌడర్ 3 కిలోలు, కంపౌండెడ్ ఇంగువ పొడి 600 గ్రాములు, పన్నీర్ చీజ్ అనలాగ్ 1 కిలో ఉన్నట్లు గుర్తించారు.

సంబంధిత పదార్థాలను స్వాధీనం చేసుకుని తదుపరి పరీక్షలు, పరిశీలనకు చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఆహార పదార్థాల తయారీ, నిల్వ, వినియోగంలో గడువు, నాణ్యత, నిల్వ విధానాలను తప్పనిసరిగా పాటించాల్సి ఉన్నప్పటికీ తనిఖీలో కొన్ని లోపాలు బయటపడినట్లు వెల్లడించారు.

## 13 నమూనాలు సేకరణ

రెస్టారెంట్‌లో తయారయ్యే ఆహార పదార్థాల నాణ్యతను నిర్ధారించేందుకు అధికారులు మొత్తం 13 నమూనాలను సేకరించారు. వీటిలో 3 చట్టపరమైన నమూనాలు, 10 పర్యవేక్షణ నమూనాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు.బెల్లం, కారం పొడి, ధనియాలు, శనగపప్పు, మామిడికాయ ఊరగాయ, కందిపప్పు, మస్టర్డ్ సాస్, స్వీట్ చిల్లీ సాస్, చిల్లీ పొడి, మటన్ మసాలా, పన్నీర్ చీజ్ అనలాగ్, చికెన్ మసాలా తదితర పదార్థాల నమూనాలను సేకరించి పరీక్షల కోసం పంపించారు. ప్రయోగశాల పరీక్షల అనంతరం ఆయా నమూనాల నాణ్యతపై స్పష్టత రానుంది.

## రక్తపు మరకలు.. నూనె, పొగ మరకలు

తనిఖీలో వంటగది పరిశుభ్రతపైనా అధికారులు తీవ్ర లోపాలను గుర్తించారు. ఫ్రీజర్‌లో మాంసం, చికెన్ రక్తపు మరకలు కనిపించినట్లు తెలిపారు. వంటగది గోడలపై నూనె, పొగ మరకలు ఉండటం, చెత్త పేరుకుపోవడం వంటి పరిస్థితులు గుర్తించినట్లు వెల్లడించారు.మురుగునీటి కాలువలు వ్యర్థాలతో మూసుకుపోయినట్లు, వంటగది పరిసరాల్లో చెత్త పేరుకుపోయినట్లు అధికారులు గుర్తించారు. ఆహార పదార్థాలను తయారు చేసే ప్రాంతాల్లో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉండగా ఈ తరహా పరిస్థితులు ఉండటంపై అధికారులు యాజమాన్యాన్ని ప్రశ్నించినట్లు సమాచారం.

## లేబుళ్లు లేని మసాలాలు

వంటల్లో వినియోగించే కొన్ని మసాలా పొడులకు సరైన లేబుళ్లు లేకపోవడాన్ని కూడా అధికారులు గుర్తించారు. అంతేకాకుండా ఆహార తయారీలో ఉపయోగించకూడని రంగుల పదార్థాలు ఉన్నట్లు తనిఖీలో బయటపడినట్లు అధికారులు తెలిపారు. ఆహార పదార్థాల తయారీలో అనుమతించిన పదార్థాలనే నిర్దేశిత ప్రమాణాల మేరకు వినియోగించాలని స్పష్టం చేశారు.

## లోపాలు సరిచేసే వరకు కిచెన్ బంద్

రెస్టారెంట్ వంటగదిలో గుర్తించిన లోపాలను వెంటనే సరిచేయాలని అధికారులు యాజమాన్యాన్ని ఆదేశించారు. పరిశుభ్రత, ఆహార నిల్వ, మురుగునీటి పారుదల, వ్యర్థాల తొలగింపు, ఆహార పదార్థాల నాణ్యత, లేబులింగ్ తదితర అంశాల్లో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.తనిఖీలో గుర్తించిన లోపాలను సరిచేసినట్లు యాజమాన్యం నివేదిక సమర్పించే వరకు వంటగది కార్యకలాపాలు నిలిపివేయాలని అధికారులు స్పష్టం చేశారు. నిబంధనలకు అనుగుణంగా వంటగది నిర్వహణ, ఆహార పదార్థాల నిల్వ, పరిశుభ్రత ప్రమాణాలు పాటిస్తున్నట్లు నిర్ధారించిన తర్వాత తదుపరి చర్యలు ఉంటాయని తెలిపారు.

## తనిఖీలతో కలకలం

మంగళగిరి--విజయవాడ మార్గంలో ప్రయాణించే వారు, స్థానికులు, కుటుంబాలతో వచ్చే వినియోగదారులు రెస్టారెంట్లపై ఆధారపడుతుంటారు. ఈ నేపథ్యంలో ఆహార నాణ్యత, వంటగది పరిశుభ్రతపై అధికారులు నిర్వహించిన తనిఖీ ప్రాధాన్యం సంతరించుకుంది.

రెస్టారెంట్లలో ఆహార పదార్థాల నాణ్యత, నిల్వ విధానం, వంటగది పరిశుభ్రత తదితర అంశాలపై క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.వినియోగదారుల ఆరోగ్యంతో ముడిపడిన ఆహార నాణ్యత విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యానికి తావులేకుండా నిబంధనలు కఠినంగా అమలు చేయాలని, లోపాలు బయటపడిన సంస్థలు వాటిని సరిచేసే వరకు అధికారుల పర్యవేక్షణ కొనసాగాలని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

# అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం

- రాంపల్లి--చర్లపల్లిలో అక్రమ షెడ్ కూల్చివేత
- నాగారంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న భవనం కూల్చివేత
- అనుమతులు లేకుండా నిర్మిస్తే చర్యలు తప్పవు: ఏసీపీ శ్రీధర్



ఘట్కేసర్( ప్రశ్న న్యూస్) ఘట్కేసర్ సర్కిల్ నాగారం డివిజన్ పరిధిలో అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు కొరడా ఝుళిపించారు. నిబంధనలను తుంగలో తొక్కుతూ చేపడుతున్న నిర్మాణాలపై చర్యలకు శ్రీకారం చుట్టారు. ఏసీపీ శ్రీధర్ ఆధ్వర్యంలో టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది జేసీబీ సహాయంతో రాంపల్లి--చర్లపల్లి ప్రాంతంలో నిర్మించిన అక్రమ షెడ్‌ను కూల్చివేశారు. అదేవిధంగా నాగారం ప్రాంతంలో మంజూరైన అనుమతులకు విరుద్ధంగా నిర్మిస్తున్న భవన నిర్మాణాన్ని కూడా అధికారులు కూల్చివేశారు. అక్రమ నిర్మాణాలపై వచ్చిన ఫిర్యాదులు, నిబంధనల ఉల్లంఘనలను పరిశీలించిన అనంతరం ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.మున్సిపల్ అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టడం, మంజూరైన అనుమతులకు విరుద్ధంగా అదనపు నిర్మాణాలు చేపట్టడం వంటివి చేస్తే ఉపేక్షించేది లేదని ఏసీపీ శ్రీధర్ స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించే నిర్మాణాలపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేసేలా కఠిన చర్యలు కొనసాగిస్తామని, నిబంధనలు పాటించకుండా నిర్మాణాలు చేపట్టే వారిపై ఉక్కుపాదం మోపుతామని తెలిపారు.

# డ్రైనేజీ నీటిలోనే రాకపోకలు

- పట్టించుకోని అధికారులు.. కాలనీ వాసుల అవస్థలు
- సాయిబాబా గుడి పక్కనే మురికి నీరు.. చిన్నారులు, మహిళలకు ఇబ్బందులు
- ప్రమాదాలు, ఆరోగ్య సమస్యలపై స్థానికుల ఆందోళన



కీసర (ప్రశ్న న్యూస్) కీసర సర్కిల్ దమ్మాయిగూడ డివిజన్ పరిధిలోని బండ్లగూడ సాయిరాం కాలనీలో సాయిబాబా గుడి పక్కన డ్రైనేజీ నీరు రోడ్డుపై నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గుడికి వెళ్లాలన్నా, స్కూల్, కాలేజీలకు వెళ్లాలన్నా మురికి నీటిలోంచే రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది.ముఖ్యంగా చిన్నారులు, మహిళలు, వృద్ధులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

మురికి నీటితో దుర్వాసన, దోమల బెడద పెరగడంతో ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై నీరు నిలిచిపోవడంతో జారిపడి ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు.సమస్యను సంబంధిత శానిటేషన్ సిబ్బంది దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ప్రజలు ప్రతిరోజూ ఇబ్బందులు పడుతున్నా అధికారులు స్పందించకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి డ్రైనేజీ నీటిని తొలగించి, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కాలనీవాసులు కోరుతున్నారు.

# కేసీఆర్ కుటుంబ ఆస్తులపై విచారణ జరగాల్సిందే..

- టీపీసీసీ చీఫ్ సంచలన వ్యాఖ్యలు



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఢిల్లీలో మీడియా ప్రతినిధులతో నిర్వహించిన 'ఆఫ్ ది రికార్డ్' సమావేశంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుటుంబ ఆస్తుల పెరిగిపోవడంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేసీఆర్ కుటుంబ భూముల గురించిన వివరాలను చాలా లోతుగా సభ దృష్టికి తీసుకువచ్చారని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. 2004, 2009 ఎన్నికల అఫిడవిట్లలో కేసీఆర్‌కు భూములు లేవని పేర్కొన్నారని, కానీ 2014 నాటికి 35 ఎకరాలు, 2018లో మరింత పెరిగి, 2023 నాటికి 53 ఎకరాలు ఉన్నట్లు చూపించారని వివరించారు. 2023 నాటికి కేటీఆర్ కుటుంబ పేరిట 123 ఎకరాలు వచ్చాయని, 2026 నాటికి కేటీఆర్ 67 ఎకరాలు కొనుగోలు చేశారని తెలిపారు. సమర్పించిన అఫిడవిట్లకు, అసలు ఆస్తులకు ఎక్కడా పొంతన లేదని, తెలంగాణలో గజం భూమి లేని పేదలు ఎందరో ఉండగా కేసీఆర్ కుటుంబానికి ఇన్ని భూములు ఎక్కడి నుంచి వచ్చాయో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.కేసీఆర్ కుటుంబం వద్ద ఉన్న భూములపై కచ్చితంగా సమగ్ర విచారణ జరగాల్సిందేనని స్పష్టం చేశారు. తాము వారిని బదనామ్ (ప్రతిష్ట దిగజార్చడం) చేయడానికి ఈ విషయాలు మాట్లాడటం లేదని, సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో మాట్లాడిన తర్వాత రాష్ట్రంలోని దళితులు, బీసీ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోందని అన్నారు.జన్వాడ ఫామ్‌హౌస్ తనది కాదని కేటీఆర్ అంటున్నారని, కానీ ఆయన అక్కడే ఉంటున్నట్లు తమకు సమాచారం ఉందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఆ ఫామ్‌హౌస్‌ను నిర్మించారని ఆరోపించారు. అయితే, ప్రభుత్వం ఎవరి ప్రైవేట్ ఆస్తులను లాక్కునే ఉద్దేశంతో లేదని స్పష్టం చేశారు. 22ఏ నిషేధిత జాబితా విషయంలో ఎక్కడో ఒకచోట అధికారుల తప్పిదం ఉండి ఉండవచ్చని, దానిపై కూడా విచారణ జరుగుతోందని చెప్పారు. ఈ నిబంధనను ముఖ్యమంత్రిగానీ, మంత్రులుగానీ తమ స్వార్థం కోసం పెట్టలేదని స్పష్టం చేశారు.స్పీకర్ తల్లిపై బీఆర్ఎస్ నేతలు వాడిన భాష ఏమాత్రం మంచిది కాదని హితవు పలికారు. పోలీసుల పట్ల బీఆర్ఎస్ నాయకులు వ్యవహరించిన తీరును తప్పుబట్టారు. గతంలో కేసీఆర్ ఢిల్లీలో ఉన్న ఇంటికి, ప్రగతి భవన్‌కు బుల్లెట్ ప్రూఫ్ తలుపులు ఏర్పాటు చేసుకున్న తీరును గుర్తుచేశారు.అలాగే రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ నాయకత్వంలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ గ్రాఫ్ గణనీయంగా పెరిగిందని, గతంలో పనిచేసిన ఇంచార్జ్‌లు కూడా బాగానే పనిచేశారని ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ కొనియాడారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588